ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
3
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
గురువారం, 18 జనవరి 2024

సంక్రాంతి సెలవుల పొడిగింపు

● 22న పాఠశాలల పునః ప్రారంభం

నెల్లూరు (విద్య), జనవరి 17: సంక్రాంతి సెలవులను ఈనెల 22వతేదీ వరకు పొడిగిస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఈవో గంగాభవాని బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల విజ్ఞప్తి మేరకు మరో మూడు రోజులు సెలవులు పొడిగించారన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను ఈనెల 22న పునః ప్రారంభించాలని ఆదేశించారు. తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఏటి పండుగలో జన సందోహం, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన





ఏటి సంబరం



పోయిరావమ్మా..: పెన్నాలో గౌరమ్మను నిమజ్జనం చేస్తూ...



చల్లగ చూడమ్మా..: నిమజ్జనానికి ముందు గొబ్బెమ్మకు పూజ

- పెన్నా తీరాన ఘనంగా గొబ్బెమ్మల పండుగ
- భక్తిశ్రద్ధలతో గౌరమ్మ ఓలలాడింపు
- ఆశీస్సులు అందించిన దేవతామూర్తులు
- ఆట, పాటలతో చిన్నాపెద్దా సందడి
- ఉత్సాహంగా పతంగుల ఎగురవేత

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 17: నెల్లూరు నగరంలోని పెన్నాతీరం బుధవారం సాయంత్రం ఏటి పండుగకు తరలివచ్చిన భక్తులతో జనసంద్రంలా మారింది. సంక్రాంతి సంబరాల్లో నాలుగోరోజు ఏటి పండుగను నిర్వహిస్తారు. ఈ పండుగలో ఆధ్యాత్మిక, సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించేలా కార్యక్రమాలను రూపొందించారు. కులమతాలకు అతీతంగా నగరవాసులు తరలివచ్చారు. సంక్రాంతి ఉత్సవాల్లో మొదటి రోజైన భోగినాడు ముత్తైదువులు గౌరమ్మలను ప్రతిష్ఠించారు. కనుమ వరకు గౌరీ వ్రతాలు, పూజలు నిర్వహించారు. కనుమ తర్వాత రోజు ముక్కనుమ నాడు పెన్నానదిలో గౌరమ్మలను నిమజ్జనం చేశారు. ఓలలాడించే సమయంలో గౌరమ్మను పాటలతో కొలిచి ధూపదీప, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఇంటి నుంచి తెచ్చుకున్న ప్రసాదాలను ఆరగించి, రకరకాల ఆటపాటలతో గడిపారు. ఈ కార్యక్రమాలను సిటీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా యువతకు పతంగులు (గాలి పటాలు) పంపిణీ చేశారు. గాలి పటాలను ఎగురవేసి ఎమ్మెల్యే ఏటి పండుగను ప్రారంభించారు. యువత కేరింతలతో పతంగులను ఎగుర వేశారు. యువతులు, మహిళలు కూడా పోటీ పడి గాలిపటాలు ఎగురవేశారు.

జానీ జోష్



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): గొబ్బెమ్మల పండుగలో ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ సందడి చేశారు. జనసేన నాయకులు, వీర మహిళలతో కలిసి పండుగలో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గునుకుల కిషోర్, చిరంజీవి యువత నాయకులు వై రవి, గుర్రం కిషోర్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కేరళ వాయిద్యాలు

ఈ సంవత్సరం ఏటి పండుగలో సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు కేరళ వాయిద్యాలు ఆకట్టుకున్నాయి. పాటలు, నృత్యాలతో కళాకారులు అలరించారు. నగర పాలక సంస్థ తాగునీరు, విద్యుత్ సౌకర్యం, మైక్ సిస్టమ్, పారిశుధ్యం వంటి వసతులు కల్పించింది. పోలీసు శాఖ, ట్రాఫిక్, బందో బస్తుతోపాటు పిట్‌ప్యాకెట్, చైన్‌స్నాచర్స్ జరగకుండా భక్తులకు రక్షణ, భద్రత కల్పించారు. ఈ కార్యక్రమాల్లో తల్పగిరి రంగనాథస్వామి ఆలయం చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.



ఆలయాల నుంచి తరలివచ్చిన దేవతలు

జిల్లాలోని వివిధ ఆలయాలకు చెందిన అమ్మవార్లు, స్వామివార్లు, ఏటి పండుగకు తరలివచ్చారు. వారి చల్లని చూపులు జిల్లా, నెల్లూరు నగరంపై ఉండాలని, అందరూ సుఖశాంతులతో జీవించేలా చూడాలని దేవతలకు సిటీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పూజలు చేశారు. పెన్నా తీరంలో కొలువు దీరిన వారిలో ఇరుకళల పరమేశ్వరి, వెంగమాంబ పేరంటాళ్ల (నర్రవాడ) శ్రీదేవి,భూదేవి సమేత తల్పగిరి రంగనాథ స్వామి, జొన్నవాడ కామాక్షమ్మ, వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి, మూలాపేట మూలస్థానే శ్వరుడు, రాజరాజేశ్వరి అమ్మవార్లు ఉన్నారు. కార్యక్రమాలను జిల్లా సహాయ కమిషనర్ జే శ్రీనివాసరావు, సహాయ కమిషనర్ వెంకట శ్రీనివాసులురెడ్డి, వీ గిరికృష్ణ, ఈవోలు ఆరంబాకం వేణుగోపాల్, ఉష, బీ మల్లికార్జునరెడ్డి, వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

ఒకే కుటుంబం నుంచి 67 మంది హాజరు

నెల్లూరులో పుట్టి వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన జంగా కుటుంబం నుంచి ఏటి పండుగలో 67 మంది సభ్యులు పాల్గొన్నారు. బెంగుళూరు నుంచి రెండు కుటుంబాలు, హైదరాబాద్ నుంచి ఆరు కుటుంబాలు, విజయవాడ నుంచి ఆరు కుటుంబాలు, చెన్నై నుంచి రెండు కుటుంబాలు, అహ్మదాబాద్ నుంచి రెండు కుటుంబాల వారు నెల్లూరుకి తరలివచ్చారు. వీరంతా సంక్రాంతికి వచ్చి ముక్కనుమ రోజున ఏటి పండుగలో గౌరమ్మలను నిమజ్జనం చేసి తమ తమ ప్రాంతాలకు తిరిగి వెళతారు. ఈ సందర్భంగా వారు ఆట పాటలతో ఉత్సాహంగా గడిపారు.

సార్వత్రిక సమరానికి

సన్నద్ధం

- ఎన్నికల ఏర్పాట్లలో యంత్రాంగం
- పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేస్తున్న సెక్టోరల్ ఆఫీసర్లు
- అధికారుల బదిలీలు ప్రారంభం.. ఇప్పటికే తహసీల్దార్లకు స్థానచలనం
- ఎప్పటికప్పుడు ప్రగతిని సమీక్షిస్తున్న ఈసీ

నెల్లూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు సన్నాహాలు ఊపందుకున్నాయి. కొన్ని నెలల నుంచి ఓటర్ల జాబితా తయారీపై కసరత్తు చేసిన అధికార యంత్రాంగం ఇప్పుడు ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమైంది. ఫిబ్రవ రిలో నోటిఫికేషన్ వెలువడుతుందన్న అంచనాల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన, మౌలిక సదుపాయాల ఏర్పాటు, బీఎల్‌ఏల నియామకం, ఎన్నికల సిబ్బందికి విధుల కేటాయింపు, అధికారుల బదిలీలు.. ఇలా అనేక కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయి. ఓటరు క్లయిమ్‌ల పరిష్కారం పూర్తికావడం తో ఇప్పుడు రెవెన్యూ సిబ్బంది మొత్తం పోలింగ్ ఏర్పాట్లలో బిజీబిజీగా గడుపుతున్నారు. కలెక్టర్ నుంచి వీఆర్వో వరకు ప్రతి ఒక్కరూ ఈ విధుల్లో భాగస్వాములై ఉన్నారు. మరోవైపు ఎన్నికల బాధ్యతల్లో ఉన్న ఇతర శాఖల అధికారులు, ఉద్యోగుల్లో కూడా హడావిడి కనిపిస్తోంది. కొందరు శిక్షణ తీసుకుంటుండగా, మరికొందరు క్షేత్రస్థాయి పనిలో నిమగ్నమయ్యారు.

● బదిలీల ప్రక్రియ షురూ..

ఇక ఎన్నికల సమయంలో కీలకమైనది అధికారులు, ఉద్యోగుల బదిలీల ప్రక్రియ. ఇప్పుడు అది కూడా ప్రారంభమైంది. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం నిర్దిష్ట మార్గదర్శకాలను జారీ చేసింది. అందులో ఎవరెవరిని బదిలీ చేయాలన్నది స్పష్టంగా తెలియజేసింది. సొంత జిల్లాల్లో పనిచేస్తున్న జిల్లా అధికారులు, సొంత జిల్లాలో కీలకమైన ఎన్నికల విధులు నిర్వహిస్తున్నవారు, మూడేళ్లకుపైగా ఒకే జిల్లాలో పనిచేస్తున్న వారు, గత ఎన్నికల్లో పనిచేసిన వారు.. ఇలా అనేక మార్గదర్శకాలను జారీ చేయగా దానికి అనుగుణంగా బదిలీల ప్రక్రియ మొదలైంది. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న శాఖలన్నింటి నుంచి ఆ వివరాలు జిల్లా కలెక్టర్‌కు చేరాయి. అక్కడి నుంచి రాష్ట్ర ఉన్నతాధికారులకు పంపగా అక్కడ ఎవరెవరిని బదిలీ చేయాలన్నది నిర్ణయిస్తున్నారు. రెవెన్యూ శాఖలో తొలుతగా 15 మంది అడహక్ తహసీల్దార్లను బదిలీ చేసి, వారి స్థానాల్లో ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో మూడేళ్లకు పైగా పనిచేస్తున్న తహసీల్దార్లను నియమించారు. అలానే జిల్లాలో పనిచేస్తున్న తహసీల్దార్లను కూడా మరికొన్ని రోజుల్లోనే ప్రకాశం, గుంటూరు జిల్లాలకు బదిలీ చేయనున్నారు. ఈ నెల 22న ఓటర్ల ముసాయిదా తుది ప్రచురణ జరగనుంది. ఆ వెంటనే ఏఈ ఆర్‌వోలుగా ఉన్న తహసీల్దార్ల బదిలీ జరుగుతుందని చెబుతున్నారు. అలానే ఎంపీడీవోలు కూడా బదిలీ కానున్నారు. దాదాపుగా ఇప్పటికే అన్ని శాఖల్లో బదిలీల జాబితా సిద్ధమైంది. ఈ నెలాఖరులోపు బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ నేపథ్యంలో రానున్న పది రోజుల్లో భారీగా బదిలీలు జరిగే అవకాశముంది.

● ఇప్పటికే దిశానిర్దేశం

వారం క్రితం కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారులు అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో విజయవాడలో సమావేశమై దిశానిర్దేశం చేశాక ఎన్నికల ప్రక్రియలో మరింత వేగం కనిపిస్తోంది. జిల్లా కలెక్టర్, ఎస్పీలు పూర్తిగా ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై దృష్టి సారించారు. ఉదయం, సాయంత్రం ఆర్‌వోలు, ఏఈఆర్‌వోలతో టెలీకాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే కీలకమైన సెక్టోరల్ అధికారులను నియమించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించే బాధ్యతలు వీరికి అప్పగించారు. వారి నుంచి క్షేత్రస్థాయి పరిస్థితులపై నివేదికను తెప్పించుకుంటున్నారు. అవసరమైన చోట్ల జిల్లా అధికారుల చేత కోఆర్డినేషన్ చేయిస్తున్నారు. మరోవైపు అన్ని రాజకీయ పార్టీల నుంచి బూత్ లెవల్ ఏజెంట్ల వివరాలను కూడా తెప్పించుకుంటున్నారు. అదే సమయంలో ఎన్నికల సంఘం అధికారులతోపాటు జిల్లా అబ్జర్వర్లు కూడా ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

తుది జాబితా ప్రచురణకు

ముందస్తు చర్యలు తీసుకోండి

● జిల్లా రోల్ అబ్జర్వర్ పోలా భాస్కర్

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 17: ఈనెల 22న ఓటర్ల తుది జాబితా ప్రచురించేందుకు అవసరమైన అన్నీ ముందస్తు



చర్యలు తీసుకోవాలని జిల్లా రోల్ అబ్జర్వర్ పోలా భాస్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో బుధవారం ఆయన ఓటర్ల తుది జాబితా ప్రచురణ, ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ హరినారాయణన్, జేసీ కూర్మనాథ్, ఈఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, సవరణ అంశాలకు సంబంధించిన రికార్డులు పక్కాగా నిర్వహించాలని చెప్పారు. రాజకీయ పక్షాలు, వ్యక్తుల నుంచేకాక మీడియాలో ఏవైనా ఫిర్యాదులు వస్తే వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదుదారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. వారానికి ఒకసారి రాజకీయ పక్షాలతో సమావేశం నిర్వహించాలన్నారు. ఓటర్ల తుది జాబితా ప్రచురితం అయ్యాక రాజకీయ పార్టీలకు ఆ జాబితాను ఇవ్వాలన్నారు. కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలుగా వినియోగించే పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో మౌలిక వసతులైన తాగునీరు, టాయ్‌లెట్లు, విద్యుత్, ఫ్యాన్లు, లైట్లు తదితర సౌకర్యాలను ఈనెల 25లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో జేసీ రోణంకి కూర్మనాథ్, డీఆర్వో లవన్న, ఈఆర్వోలు విద్యాధరి, మలోల, శీనానాయక్, మధులత, బాపురెడ్డి, ఓబులేసు, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పట్టువీడని అంగన్‌వాడీలు

చిన్నారులతో కలసి ఆందోళన

నెల్లూరు (వైద్యం) జనవరి 17: జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీల సమ్మె బుధవారం నాటికి 37వరోజుకు చేరుకుంది. జిల్లాలోని ఐసీడీఎస్ కేంద్రాల వద్ద పట్టు విడవకుండా వారు ధర్నా చేస్తున్నారు. నెల్లూరు నగరంలోని కలెక్టరేట్ వద్ద గత ఏడాది డిసెంబరు 28 నుంచి రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం చిన్నారులు కూడా ఈ దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెల్లూరు నగర మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడారు. 37 రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నా నేటికీ ప్రభుత్వం పట్టీపట్టనట్లు వ్యవహరించటం సిగ్గుచేటన్నారు. సమస్యలు పరిష్కరించకపోగా ఎస్మాను ప్రయోగించటం దుర్మార్గమని పేర్కొన్నారు. పాలకులు అంబానీ, అదానీల సేవలో తరలిస్తున్నారేగాని అంగన్‌వాడీల సమస్యలను పట్టించు కోవటంలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రులు, సలహాదారులు కేవలం చర్చలతో కాలయాపన చేస్తున్నారని దుయ్యబట్టారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా, నగర కార్యదర్శులు అజయ్‌కుమార్, నాగేశ్వరరావు , నగర, రూరల్ అధ్యక్షుడు అత్తిమూరు శ్రీనివాసులు, కొండా ప్రసాద్, సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నేతలు రజిని, సంపూర్ణమ్మ, సుమతి, రత్నమ్మ, వెంకటకుమారి, మల్లమ్మ పాల్గొన్నారు.



ఉదయగిరి : విధుల్లో చేరుతున్నట్లు సీడీపీవోకు వినతిపత్రాన్ని అందజేస్తున్న అంగన్‌వాడీలు

విధుల్లో చేరిన అంగన్‌వాడీలు

ఉదయగిరి రూరల్, జనవరి 17: ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు బుధవారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా సీడీపీవో పచ్చవ లావణ్య మాట్లాడుతూ ఉదయగిరి ప్రాజెక్టు పరిధిలోని సీతారామపురం, దుత్తలూరు, వరికుంటపాడు, ఉదయగిరి మండలాల్లో 208 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయన్నారు. షోకాజ్ నోటీసులు తీసుకున్న, తీసుకోని వారు ఇప్పటివరకు 113 మంది విధుల్లో చేరి కేంద్రాలను తెరిచారన్నారు.



ఒంటిపై పెట్రోలు పోసుకున్న రవిపై నీళ్లు పోస్తున్న సిబ్బంది

పొజిషన్ సర్టిఫికెట్ ఇస్తారా... చచ్చిపొమ్మంటరా?

- వరికుంటపాడు తహసీల్దార్ గది ఎదుట ఎస్టీ దంపతుల ఆత్మహత్యాయత్నం
- అడ్డుకున్న సిబ్బంది

వరికుంటపాడు, జనవరి 17: 'ఏళ్ల తరబడి పూరి గుడిసెలో నివాసం ఉంటున్నాం. ఎస్టీ వర్గానికి చెందిన తమకు పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు చేయడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నారు. ఇప్పటికైనా పొజిషన్ సర్టిఫికెట్ ఇస్తారా... లేక చచ్చి పొమ్మంటరా' అని స్థానిక తహసీల్దారు గది ఎదుట రవి దంపతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ సంఘటన బుధవారం వరికుంటపాడు తహసీల్దార్ కార్యాలయంలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల మేరకు, వరికుంటపాడు ఎస్టీ కాలనీకి చెందిన ఇట్ల రవి, తన భార్య, ముగ్గురు పిల్లలతో కలసి పూరి గుడిసెలో కాపురం ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో తనకు పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు చేయాలని అధికారుల చుట్టూ ఐదేళ్లుగా తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయింది. దీంతో బుధవారం మరోసారి కార్యాలయానికి వచ్చిన రవి దంపతులు అధికారుల తీరును నిరసిస్తూ తహసీల్దారు గది బయట సీసాలో తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒక్కసారిగా ఒంటిపై పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో అక్కడ ఉన్న ఉద్యోగులతోపాటు ప్రజలు భయందోళనకు గురయ్యారు. వెంటనే అతడిపై నీరు పోసి పెట్రోలు సీసాను విసిరివేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ తమపై కక్ష సాధింపు చర్యలతోనే వీఆర్వో తీవ్ర అన్యాయం చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికే తమపై అక్రమ కేసులు సైతం బనాయించాడని వాపోయాడు. అయితే రవి కుటుంబం ఉన్న స్థలం ఇతరుల పట్టాభూమి అని, పొజిషన్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు వీలు పడదని, ప్రస్తుతం ఈ విషయం కోర్టు పరిధిలో ఉందని రెవెన్యూ అధికారులు తెలిపారు. అంతేకాక రవి దంపతులకు హౌసింగ్ శాఖ నుంచి నివాసం మంజూరు అయినట్లు జాబితాలో కూడా పేరు లేదని, దీంతో పొజిషన్ ఇచ్చేందుకు అవకాశం లేకుండా పోయిందని వారు తెలిపారు. అనంతరం రికార్డులు పరిశీలించిన తహసీల్దారు మల్లికార్జున రవి దంపతుల నుంచి వినతిపత్రం స్వీకరించారు.ఈ విషయమై సమగ్ర విచారణ చేపట్టి తప్పక న్యాయం చేస్తానని వారికి హామీనిచ్చారు.



ఆందోళన వ్యక్తం చేస్తున్న రవి దంపతులు

వీఆర్వో మృతితో విషాదం


పుల్లారావు (ఫైల్)

అల్లూరు, జనవరి 17 : అల్లూరుకు చెందిన దగదర్తి వీఆర్వో బండ్ల పుల్లారావు(48) రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో స్వగ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. అల్లూరు మండలంలో ఆరు నెలల క్రితం వరకు వీఆర్వోగా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై దగదర్తికి వెళ్లిన ఆయన మంగళవారం అక్కడ విధులు పూర్తి చేసుకొని తిరిగి స్వగ్రామమైన అల్లూరుకు ద్విచక్ర వాహనంపై వస్తూ మార్గమధ్యంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి పడి మృతిచెందిన విషయం విదితమే. ఆయన భౌతికకాయాన్ని సహచర వీఆర్వోలు, అధికారులు తరలివచ్చారు. పుల్లారావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

● **అదృశ్యమైన వృద్ధుడు...**

అల్లూరుకు చెందిన కత్తుల సుబ్బయ్య (70) ఈనెల 14 మధ్యాహ్నం నుంచి అదృశ్యం అయ్యాడు. ఈ క్రమంలో కొడవలూరు రైల్వే గేటుకు సమీపంలో వృద్ధుడి మృతదేహం ఉండగా మృతుడు ధరించిన దుస్తుల ఆధారంతో కుటుంబ సభ్యులు గుర్తించి సుబ్బయ్య మృతదేహాన్ని బుధవారం అల్లూరుకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

ఉరి వేసుకుని కారు డ్రైవర్ ఆత్మహత్య

● మృతుడికి మానసిక స్థితి సరిలేదని తండ్రి ఫిర్యాదు


పుల్లారావు (ఫైల్)

కావలి రూరల్, జనవరి 17: కావలి పట్టణం వెంగళరావునగర్‌లో నివాసం ఉంటున్న కారు డ్రైవర్ దుడ్డు మహేష్ (33) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రెండవ పట్టణ పోలీసులు, మృతుడి బంధువుల వివరాల మేరకు.. వెంగళరావునగర్‌కు చెందిన మహేష్‌కు గత ఏడాది ఆగస్టులో వివాహం జరిగింది. ఇది తొలి సంక్రాంతి పండుగ కావడంతో భార్య దివ్య పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో మండలంలోని తాళ్లపాలెంలోని ఆలయం వద్ద మొక్కులు తీర్చుకుని వస్తానని మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన మహేష్ మంగళవారం రాత్రి తిరిగి ఇంటికి వచ్చాడు. బుధవారం ఉదయం ఇంట్లోని ఒక గది తలుపులు తీయ్యగా మహేష్ ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెంది ఉండటాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారు. అయితే తమ కుమారుడి మానసిక స్థితి సరిలేని కారణంగా ఆత్మహత్య చేసుకుని ఉంటాడని మృతుడి తండ్రి శివయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి ఏఎస్ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని దుప్పి మృతి

అనంతసాగరం, జనవరి 17: అనంతసాగరం చెరువుకట్ట సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని బుధవారం దుప్పి మృతిచెందింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు అటవీ శాఖాధికారులు అక్కడికి చేరుకొని దుప్పిని స్వాధీనం చేసుకున్నారు. పంచనామా నిర్వహించి ఖననం చేశారు.


మృతిచెందిన దుప్పిని ఖననం చేస్తున్న అధికారులు

దేశభక్తి ఉట్టిపడేలా గణతంత్ర వేడుకలు : జేసీ


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ కూర్మనాథ్, పక్కనే ఏఎస్పీ, డీఆర్వో

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 17 : నెల్లూరులో ఈనెల 26న జరిగే గణతంత్ర దినోత్సవాన్ని జాతీయ సమైక్యత, దేశభక్తి ఉట్టిపడేలా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ తిక్కన ప్రాంగణంలో గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతేడాది ఎంతో ఘనంగా జరిగాయని, అదేవిధంగా ఈ ఏడాది కూడా ఎంతో ప్రతిష్టాత్మకంగా సజావుగా జరపాలన్నారు. ఏడాదిపాటు జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ ప్రసంగిస్తారని అందుకు అనుగుణంగా ప్రసంగం తయారు చేసేందుకు ప్రగతి నివేదికలను 19లోగా ముఖ్యప్రణాళిక అధికారికి అందజేయాలని సూచించారు. ప్రభుత్వ శాఖల్లో ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేసేందుకు వీలుగా అభియోగాలు లేనివారి పేర్లను వారి చేసిన సేవలను వివరిస్తూ నిర్ణీత సమయంలో ప్రతిపాదించి పంపాలన్నారు. ప్రతి ప్రభుత్వ అధికారి కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసు పరెడ్ మైదానంలో జరిగే వేడుకలకు హాజరు కావాలన్నారు. కోవిడ్ నిబంధనలను విధిగా పాటించాలన్నారు. దేశభక్తిని పెంపొందించే, ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులంతా ఉదయం 8గంటలకు హాజరయ్యేలా చూడాలన్నారు. ప్రజాప్రతినిధులను ఆహ్వానించడంతోపాటు ప్రొటోకాల్ ప్రకారం మర్యాదలు, సీటింగ్ ఏర్పాట్లు తప్పనిసరిగా చేయాలన్నారు. సమావేశంలో డీఆర్వో లవన్న, ఏఎస్పీ శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు సాంబశివారెడ్డి, వెంకటరావు, జడ్పీ సీఈవో చిరంజీవి, ఆర్డీవో మలోల, ఐటీడీఏ పీవో మందారాణిలతోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బండ లాగుడు పోటీలో విజేతగా నంద్యాల ఎడ్లజత


కాకుటూరులో బండలాగుతున్న ఎడ్ల జత

వలేటివారిపాలెం, జనవరి 17 : మండలంలోని కాకుటూరు బస్టాండ్ సెంటర్‌లో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరిగిన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలో నంద్యాల జిల్లా డోన్ గ్రామానికి చెందిన ధర్మవరం వెంకటసుబ్బారెడ్డికి చెందిన ఎడ్లజత విజేతగా నిలిచి మొదటి బహుమతి రూ.1,10,000 సాధించాయి. ఈ పోటీలలో జూనియర్, సీనియర్ విభాగాలలో 25 ఎడ్లజతలు పాల్గొన్నాయి. కృష్ణా జిల్లాకు చెందిన మేకా కృష్ణమోహన్‌కు చెందిన ఎడ్లజత ద్వితీయ స్థానంలో నిలిచి రూ.90 వేలు బహుమతి సాధించాయి. ప్రకాశం జిల్లా బల్లికురవకు చెందిన పావులూరి వీరాస్వామి చౌదరికి చెందిన ఎడ్లజత తృతీయ స్థానంలో నిలిచి మూడవ బహుమతి రూ.70 వేలు దక్కించుకున్నాయి. విజేతలుగా నిలిచిన ఎడ్లజతల యజమానులకు ఇంటూరి నాగేశ్వరావు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ప్రకాశం జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ, ఒంగోలు, కనిగిరి, కందుకూరు మాజీ ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, దివి శివరాం, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, చీరాల ఇన్‌చార్జి ఎంఎం కొండయ్య, ఉన్నం నళినీదేవి తదితరులు పాల్గొన్నారు.

బార్లను తలపిస్తున్న వైన్ షాపులు

● యథేచ్ఛగా సిట్టింగులు

● పట్టించుకోని ఎక్సైజ్, సెబ్ అధికారులు


మద్యం దుకాణం పక్కనే సిట్టింగుల్లో మందుబాబులు

పొదలకూరు, జనవరి 17 : మండలంలోని కొన్ని మద్యం షాపులు బార్‌లను తలపిస్తున్నాయి. నిబంధనలను గాలికి వదిలేసి రేకుల షెడ్లు వేసి బెంచీలు, టేబుళ్లు వేసి యథేచ్ఛగా సిట్టింగులను నిర్వహిస్తున్నా ఎక్సైజ్ శాఖాధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఆయా వైన్ షాపుల పరిసరాలలో నివాస గృహాలు ఉన్నా పట్టించుకునే నాథుడే లేడని స్థానికులు వాపోతున్నారు. మండలంలో ఉన్న 7 మద్యం షాపుల్లో విచ్చలవిడిగా సిట్టింగులను నిర్వహిస్తున్నారు. మద్యం ప్రియులకు కావాల్సిన తినుబండారాలు, వాటర్ బాటిళ్లు, గ్లాసులు ఏర్పాటు చేసి సిట్టింగులను నిర్వహిస్తుండడంతో మందుబాబులు విచ్చలవిడిగా మద్యం సేవించి ఆ మత్తులో ప్రమాదాలకు గురవుతున్నారు. కొన్ని మండలాల్లో వైన్‌షాపుల పక్కనే నివాస గృహాలు ఉన్నా ఈ సిట్టింగులను నిర్వహించడం వల్ల ఆయా గృహాల్లో నివసించే వారు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆదాయమే లక్ష్యంగా వైన్ షాపులకు టార్గెట్లు విధిస్తున్న ఎక్సైజ్ శాఖాధికారులు నిబంధనలను పాటిస్తున్నారా, లేదా అనే విషయమై తనిఖీలు చేయడంలేదు. వైన్ షాపుల యజమానులు నెలనెలా ఇచ్చే మామూళ్లు తీసుకుని అటువైపు కన్నెత్తి చూడడంలేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా ఎక్సైజ్ శాఖాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	120
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	216
స్కిన్‌లెస్	240
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5921
వెండి కిలో ధర	రూ. 73,000
వెండి ఒక గ్రాము	రూ. 75.00

ఆర్టీసీ ప్రయాణం సురక్షితమేనా ?

● పండుగ రోజుల్లో ప్రయాణికుల రద్దీ ● కండీషన్ లేని బస్సుల ఏర్పాటు ● ఫిట్‌నెస్‌పై సందేహాలు
● నాలుగేళ్లుగా రాని కొత్త సర్వీసులు ● ఇష్టానుసారం ప్రైవేటు ట్రావెలర్స్ ● అధికార పార్టీ అండదండలు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట),జనవరి 17 : పండుగలు వస్తున్నాయంటే ఇతర ప్రాంతాల్లో ఉన్న వారంతా సొంతూర్లకు వచ్చేందుకు క్యూ కడతారు. సంక్రాంతి అంటే ఎన్ని పనులున్నా వదులుకొని బంధుమిత్రుల కోసం వస్తారు. పండుగకు రెండు రోజుల ముందు నుంచి ప్రారంభమయ్యే ప్రయాణాలు పండుగ ముగిసిన రెండుమూడు రోజుల వరకు సాగుతాయి. అయితే ఆర్టీసీలో టికెట్లు రిజర్వేషన్ చేసుకున్న వారి ప్రయాణాలు భద్రమేనా ? అంటే అందుకు స్పష్టమైన సమాధానం లేదు. పండుగ రోజుల్లో ప్రజలు అధికంగా ప్రయాణాలు చేస్తుండటంతో గతంలో ఎప్పుడూ కన్పించని ట్రావెల్స్ బస్సులు రోడ్లపై కనిపిస్తాయి. ఆన్‌లైన్‌లో కొత్తకొత్త బస్సు సర్వీసుల పేర్లతో రిజర్వేషన్‌కు దర్శనమిస్తుంటాయి. ఇంతకీ వీటన్నింటికి పూర్తి స్థాయిలో ఫిట్‌నెస్ ఉందా.. ? అధికారుల అనుమతులు తీసుకున్నారా.. ? అందుకు సంబంధించిన పత్రాలను బస్సుల్లో ఉంచుకున్నారా.. ? ఇలా అనేక ప్రశ్నలకు సమాధానాలు ఉండవు.

● **ఇష్టానుసారంగా ప్రైవేటు ట్రావెల్స్**

దూరప్రాంతాలైన హైదరాబాదు, బెంగళూరు, విశాఖపట్నం, చెన్నై వంటి ప్రాంతాలకు పండుగ రోజుల్లో వందల సంఖ్యల్లో ప్రైవేటు బస్సులు నడుపుతారు. మామూలు రోజుల్లో దూరప్రాంతాలకు 30లోపు ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు ఉంటే, పండుగ సీజన్‌లో వందకుపైగా ఉంటాయి. ఇన్ని బస్సులు ఎక్కడ నుంచి వస్తున్నాయి. ? అనే ప్రశ్నకు ఎవరి వద్ద సమాధానం లేదు. ఈ బస్సులు ఫిట్‌నెస్ కలిగి ఉన్నాయా, ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు అనుమతులు తీసుకున్నారా, డ్రైవర్లు ఫిట్‌గా ఉన్నారా..? అనేప్రశ్నలు తెరపైకి వస్తాయి. ఈ ప్రశ్నలన్నింటికి రవాణాశాఖ అధికారులు విస్తృత తనిఖీల ద్వారా సమాధానాలు ఇవ్వాల్సి ఉంది. అయితే అధికార పార్టీ నాయకుల అండ ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలకు పుష్కలంగా ఉండటంతో అధికారులు సైతం చేసేది లేక రైట్ రైట్ అంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

● **నాలుగేళ్లుగా రాని కొత్త బస్సులు**

వైసీపీ ప్రభుత్వం వచ్చాక నెల్లూరు రీజియన్‌కు ఒక్క సూపర్‌లగ్జరీ బస్సు, వోల్వా బస్సు కూడా కొత్తది రాలేదు. డిపోలో రోజూ తిరిగే షెడ్యుల్ బస్సులు కాకుండా ఓ పది బస్సులు మాత్రమే అధికంగా ఉంటున్నాయి. ఆ బస్సులను ఆయా రూట్లలో మరమ్మతులు అయిన బస్సుల స్థానాల్లో నడుపుతుంటారు. ఇక కొత్త బస్సులు రీజియన్‌కు కేటాయించకపోవడంతో కాలం చెల్లిన బస్సులే నడుస్తున్నాయి. నెల్లూరు రీజియన్‌లో కిలోమీటర్ల వారీగా తీసుకుంటే 50 శాతానికి పైగా బస్సులు కాలం చెల్లినవే అని పలువురు అంటున్నారు. వీటిల్లో ప్రయాణం భద్రమేనా అని వారంటున్నారు.

శరవేగంగా నెల్లూరు రైల్వేస్టేషన్ పనులు

● మే కల్లా పూర్తయ్యేలా కార్యాచరణ

నెల్లూరు (వెంకటేశ్వరపురం), జనవరి 17 : దక్షిణ మధ్య రైల్వే స్టేషన్లలో ప్రధానమైనదిగా గుర్తింపు తెచ్చుకున్న నెల్లూరు రైల్వే స్టేషన్‌లో పునరాభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ పనులకు రైల్వేశాఖ దాదాపు రూ.102 కోట్లు కేటాయించింది. 21 నెలల్లో పనులు పూర్తి చేసేలా కాంట్రాక్టర్‌కు అప్పగించారు. నాలుగేళ్ల క్రితమే టెండర్ల పని పూర్తయినప్పటికీ కొవిడ్ నేపథ్యంలో 2021 డిసెంబరులో పనులు ప్రారంభమయ్యాయి. స్టేషన్ నూతన భవనాలు, రైల్వేకోర్టు, రైల్వే పోలీసు కార్యాలయం, సబ్‌వేలు, కమర్షియల్ క్లాంప్లెక్స్.. ఇలా అనేక పనులు జరుగుతున్నాయి. అవి దాదాపు 80శాతం పూర్తయ్యాయి. ఈ ఏడాది మే నాటికి పనులు పూర్తి అవుతాయని దక్షిణమధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ ప్రకటించారు.


నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు

రేపటి నుంచి కులగణన

● పకడ్బందీగా జరగాలి ● గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలి : కలెక్టర్ హరినారాయణన్


మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 17 : జిల్లాలో శుక్రవారం నుంచి ఈనెల 28వ తేదీ వరకు కులగణన జరుగుతుందని, దీనిని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఎం హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం కులగణన, జన్ భగీదరి, గణతంత్ర దినోత్సవ వేడుకలు, అంగన్‌వాడీల సమ్మె తదితర అంశాలపై అధికారులతో ఆయన చర్చించారు. కులగణన సున్నితమైన అంశమని ప్రజలతో జాగ్రత్తగా, మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి సచివాలయ పరిధిలో కులగణన చేసే సిబ్బంది ఇంటింటికి తిరిగి ఈకేవైసీ సేకరించాలన్నారు. దీనికి సంబంధించి గురువారం మరోసారి శిక్షణ ఇవ్వాలని జడ్పీ సీఈవో చిరంజీవిని ఆదేశించారు. శుక్రవారం విజయవాడలో జరిగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక మహాశిల్పం ఆవిష్కరణకు జిల్లా నుంచి 5వేల మంది హాజరవుతున్నారని, వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డికి సూచించారు. 26వ తేదీన గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డీఆర్వో లవన్నకు సూచించారు. ఈ సమావేశంలో జేసీ రోణంకి కూర్మనాథ్, ఐసీడీఎస్ పీడీ హేనసుజన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి స్త్రీ, పురుషుల చెడుగుడు పోటీలు


చెడుగుడు పోటీలో తలపడుతున్న మహిళలు

బిట్రగుంట, జనవరి 17: బోగోలు పంచాయతీ కుమ్మరవీధిలో యూత్ ఆర్గనైజేషన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభమైన రెండు రోజుల జిల్లాస్థాయి మహిళా చెడుగుడు పోటీలు బుధవారం హోరాహోరీగా జరిగాయి. ఈ పోటీలకు జిల్లాలోని పలు మండలాల నుంచి 20 పురుషుల జట్లు, 10 మహిళల జట్లు పాల్గొన్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. నెల్లూరు ఏసీ స్టేడియం - డీకేడబ్ల్యూ జట్ల మధ్య పోటీ హోరాహోరీగా జరిగాయి. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బోగిరిప్రభాకర్, మేకల కిరణ్, ఎం.మురళి, శ్యాంసుధాకర్, లేగుంటపాటు శీను, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 17: జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కేవీ రామాంజనేయులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తిరుపతికి చెందిన యూత్ ఫర్ జాబ్స్ ఫౌండేషన్ వారు పాల్గొంటారన్నారు. ప్రాసెస్ ఎగ్జిక్యూటివ్, సీనియర్ ప్రాసెస్ ఎగ్జిక్యూటివ్, ప్రాసెస్ స్పెషలిస్ట్ టీమ్ లీడర్, అసిస్టెంట్ మేనేజర్, టెక్నికల్ హెల్ప్ డెస్క్ సపోర్టర్ పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసి, కంప్యూటర్ సైన్స్ విద్యార్హత కలిగిన వారు ఇంటర్వ్యూకు హాజరు కావచ్చన్నారు. 69 పోస్టులు భర్తీ చేస్తారని, ఎంపికైన వారికి రూ. 20వేలకుపైగా వేతనం లభిస్తుందన్నారు. ఆసక్తి కలిగినవారు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు జిల్లా ఉపాధి కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలిపారు.

ఎన్టీఆర్ వర్ధంతిని విజయవంతం చేయండి

కొండాపురం : టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతిని జయప్రదం చేయాలని టీడీపీ మండల కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 9 గంటలకు కొండాపురంలోని టీడీపీ కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

సర్వేపల్లిలో భూ దోపిడీ : సోమిరెడ్డి


భూపంపిణీలో అవకతవకలపై తహసీల్దారును ప్రశ్నిస్తున్న మాజీ మంత్రి సోమిరెడ్డి

పొదలకూరు, జనవరి 17 : సర్వేపల్లి నియోజకవర్గంలో పేదల భూ పంపిణీ పేరుతో మంత్రి కాకాణి భారీ దోపిడీ చేస్తున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు వీరవసంతరావును మండలంలోని భూ పంపిణీ కార్యక్రమంలో జరుగుతున్న పలు అవకతవకలు, అక్రమాలపై నిలదీశారు. అనంతరం సోమిరెడ్డి తహసీల్దారు కార్యాలయం ముందు మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడుతూ గ్రామాల్లో ఎటువంటి గ్రామసభలు నిర్వహించకుండా మేత, కొండ, వాగు, పోరంబోకు భూములకు ఎలా పట్టాలు ఇస్తారని ప్రశ్నించారు. తన దగ్గర ఉన్నది ఫేక్ లిస్ట్ అయితే, ఒరిజినల్ లిస్ట్ బయట పెట్టాలని తహసీల్దారును అడిగారు. న్యాయంగా పేదలకు పట్టాలు ఇస్తే సహకరిస్తానని, చట్టవిరుద్ధంగా భూదోపిడీ చేస్తే సహించేది లేదన్నారు. మండలంలో భూపంపిణీకి ఎంపిక చేసిన వారిలో మొత్తం వైసీపీ వారే ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్, రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, రాజంపేట మండల అధ్యక్షుడు సుబ్బనరసయ్య, పొదలకూరు మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, బొద్దులూరి మల్లికార్జున్‌నాయుడు, సీనియర్ నాయకులు పులిపాటి వెంకటరత్నంనాయుడు, బక్కయ్యనాయుడుతోపాటు పలువురు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొండ్ర బిట్రగుంట వేంకటేశ్వరాలయంలో వేలం పాటలు


వేలం పాటలో పాల్గొన్న దేవదాయ శాఖ అధికారులు

బిట్రగుంట, జనవరి 17: బోగోలు మండలం కొండబిట్రగుంట బిలకూట క్షేత్ర నివాసి ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు, తదితర వాటికి సంబంధించి బుధవారం బహిరంగ వేలం పాటలు జరిగాయి. కొబ్బరికాయలు, పూజద్రవ్యాలు, చెరుకు దుకాణాలు, రంగుల రాట్నం ఏర్పాటు, తాత్కాలిక షాపుల నుంచి రుసుం వసూలు, పాదరక్షకులు భద్రపరుచుకొనే హక్కులకు సంబంధించి బహిరంగ వేలం పాటలు ఈవో రాధాకృష్ణ, పాలక మండలి చైర్మన్ ఆధ్వర్యంలో జరిగాయి. అయితే కొబ్బరి చిప్పలు సేకరణ, పాద రక్షకులు భద్రపరుచు హక్కులు, ఆవుపేడ సేకరణకు వేలం వాయిదా పడింది. ఈ వేలం ద్వారా గత ఏడాదికంటే రూ.7.20 లక్షలు అదనంగా వచ్చిందని ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో కోవూరు, పార్లపల్లి గ్రూప్స్ టెంపుల్స్ ఈవోలు కృష్ణప్రసాద్, యనాదయ్య, మండల ఉపాధ్యక్షుడు మాధవరెడ్డి, ధర్మకర్తలు మాల్యాద్రి, ఓబుల్‌రెడ్డి, మాజీ ధర్మకర్త పాపయ్య, స్థానికులు వేంకటేశ్వర్లు, బ్రహ్మానందం, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

కామాక్షితాయి సేవలో జిల్లా అదనపు న్యాయాధికారి


జొన్నవాడ కామాక్షితాయిని కుటుంబ సమేతంగా దర్శించుకుంటున్న జిల్లా అదనపు న్యాయాధికారి కపర్ది

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 17: మండలంలోని జొన్నవాడ ఆలయాన్ని బుధవారం జిల్లా అదనపు న్యాయాధికారి జి.కపర్ది బుధవారం కుటుంబ సమేతంగా సందర్శించారు. మల్లికార్జునస్వామి, కామాక్షితాయిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం గోత్ర నామాలతో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. వారి వెంట ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

భూ సమస్యలు పరిష్కారమయ్యేనా ?

● ఏపీ ల్యాండ్ టైటలింగ్ యాక్టుపై సందేహాలు ● న్యాయం జరగదంటున్న బాధితులు
● చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని సర్వత్రా డిమాండ్ ● ఖాతరు చేయని ప్రభుత్వం


సంగంలో వివాదంలో ఉన్న అసైన్‌మెంట్ పొలాలు

సంగం, జనవరి 17: రాష్ట్ర ప్రభుత్వం తాజాగా అమల్లోకి తెచ్చిన ఏపీ ల్యాండ్ టైటలింగ్ యాక్టు -2022పై ప్రజల నుంచి పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ చట్టాన్ని అత్యధికులు వ్యతిరేకిస్తున్నారు. ఈ చట్టం వల్ల భూ సమస్యలు పరిష్కారం కావని భావిస్తున్నారు. ఓ టీఆర్‌వో (టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారి) నిర్ణయంపైనే అంతా జరగడంపై అభ్యంతరం తెలియజేస్తున్నారు. అన్యాయం జరిగిందని భావిస్తే బాధితుడు హైకోర్టులో మాత్రమే కేసు వేసుకోవాలి. ఇది పేదలకు సాధ్యపడుతుందా ? అనేది న్యాయవాదుల ప్రశ్న. కొత్త చట్టం ప్రభావంతో భూములపరంగా అత్యంత విలువైన సేవలు అందిస్తున్న రిజిస్ట్రేషన్, రెవెన్యూ, న్యాయవ్యవస్థల ఉనికి ప్రశ్నార్థకమవుతుందన్న భావన బలీయంగా వినిపిస్తోంది. ప్రజానీకంతోపాటు న్యాయవాదులు కూడా ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనలు చేస్తున్నారు. ఏళ్ల తరబడి సాగుచేసుకుంటున్న వారి భూములు నిషేధిత జాబితాలో ఉండడం, డీ.పట్టా భూమిగా నమోదు కావడం తదితర భూవివాద బాధితులంతా కొత్త చట్టంపై గగ్గోలు పెడుతున్నారు. ఇక తమకు న్యాయం జరగదంటున్నారు.

● కొత్త చట్టం ప్రకారం భూ ప్రాధికార సంస్థ టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారి (టీఆర్‌వో) పరిధిలోకి స్థిరాస్తులన్నీ వెళ్తాయి. ప్రతి భూ లావాదేవీకి టీఆర్‌వో అనుమతి తప్పనిసరి. స్థిరాస్తి కొనుగోలు తనఖా, దాన పత్రాలు అందచేయడం తదితర కార్యకలాపాలేవి చేసినా టీఆర్‌వో దగ్గర నమోదు చేసుకోవాలి. ఆయనదే తుది నిర్ణయం. దీనిపై సాధారణ సివిల్ కోర్టుల్లో సవాలు చేసే వీలు లేదు. వివాదాస్పద అంశాన్ని టీఆర్‌వో నమోదు చేసిన పక్షంలో దాన్ని సవాలు చేసుకునేందుకు హైకోర్టును మాత్రమే ఆశ్రయించాల్సి ఉంటుంది. కింది కోర్టులో సవాలు చేసే వీలు లేదు. సామాన్యులకు నష్టం తెచ్చే ఏపీ ల్యాండ్ టైటలింగ్ చట్టాన్ని రద్దు చేయాలని న్యాయవాదులు పెద్దఎత్తున డిమాండ్ చేస్తున్నారు.

● నూతన చట్టం ప్రకారం ప్రతి ఆస్తి సంబంధిత అంశాలన్నీ టీఆర్‌వో కనుసన్నల్లో జరగాల్సి ఉంటుంది. ఆస్తిపై హక్కులకు ఎవరికైనా పవర్‌ఆఫ్ అటార్నీ ఇచ్చినా టీఆర్‌వో దగ్గర నమోదు చేసుకోవాలి. అధికార పార్టీ నాయకుల చెప్పుచేతల్లో ఇప్పటికే వీఆర్‌వో, ఇతర రెవెన్యూ వ్యవస్థ నడుస్తుందన్నా అపవాదు ఉంది. ఈ పరిస్థితుల్లో టీఆర్‌వో పేరుతో మరన్ని అధికారాలను ఇస్తూ చట్టం చేయడం సరికాదంటున్నారు.

● **చట్టాన్ని వెనక్కి తీసుకోవాలి**

ప్రజల స్థిరాస్తులు, ఇతర లావాదేవీలపై స్వేచ్ఛ, అధికారం, స్వతంత్రత కోల్పోయే ఈచట్టాన్ని వెనక్కి తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.. ఈ కొత్త చట్టం భూతంలా ప్రజాసమూహాన్ని అవహించడం ఖాయం. ఈ చట్టం కోరల నుంచి ప్రజలు తమంతట తాముగా రక్షించుకోవాలి. చట్టాన్ని ఉపసంహరించుకోకుంటే సమాజంలో మరిన్ని అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకునే ప్రమాదం ఉంది. రాజకీయ బలం ఉన్న నాయకులదే పెత్తనమవుతుంది. టీఆర్‌వో నిమిత్తమాత్రులుగానే మిగిలిపోయే అవకాశం ఉందని పలు ప్రజాసంఘాలు, మేధావులు పేర్కొంటున్నారు.

● **పట్టించుకోని ప్రభుత్వం**

ఈ చట్టం పట్ల ప్రభుత్వం మొండిగా ముందుకే వెళ్తుంది. స్వార్థ రాజకీయ దృష్టితోనే చూస్తుంది. అధికారంలో ఉండే వారే పెత్తనం చెలాయించేందుకే ఈ చట్టం ఉపయోగపడుతుందని ప్రజాసంఘాలు విమర్శిస్తున్నా ప్రభుత్వం ఖాతరు చేయడం లేదు.

వ్యవసాయ కనెక్షన్లకు ట్రాన్స్‌ఫార్మర్లు సిద్ధం : ఎస్‌ఈ

నెల్లూరు (జడ్పీ), జనవరి 17: జిల్లాలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు వచ్చాయని, ఆ శాఖ ఎస్‌ఈ విజయన్ తెలిపారు. విద్యుత్ భవన్‌లోని తన చాంబర్ నుంచి బుధవారం ఆయన అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్లన్నీ గోదాములకు చేరాయని,వాటికి అవసరమైన మెటీరియల్ సిద్ధంగా ఉందన్నారు. అధికారులు వాటిని తీసుకెళ్లి వ్యవసాయ కనెక్షన్ల పనులు చేపట్టాలన్నారు. వేసవిలో అత్యధికంగా విద్యుత్ వాడకం ఉండే అవకాశం ఉంటున్నందున ముందస్తు చర్యలు, ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు. వినియోగదారులకు ఎలాంటి సమస్యలు తలెత్తినా 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చునన్నారు. పగటిపూట విద్యుత్ దీపాలు వెలగకుండా అధికారులంతా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సమావేశంలో సీనియర్ అకౌంట్ అధికారి మురళి, అసిస్టెంట్ ఇంజనీర్లు కల్పన, అనిల్, నరసింహారావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

● యూటీఎఫ్ నేతల సంఘీభావం ● జగనన్నకు చెబుదాం...కోటి సంతకాల సేకరణ ప్రారంభం



కావలిటౌన్: సంఘీభావం తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు



ఆత్మకూరు : నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కావలిటౌన్, జనవరి 17: సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె బుధవారం 37వ రోజుకు చేరింది. యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు రమాదేవి, శ్రీదేవి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ బెజవాడ రవికుమార్ జగనన్నకు చెబుదాం అనే కోటి సంతకాల కార్యక్రమాన్ని తొలి సంతకం చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నేతలు పెంచలయ్య, మాల్యాద్రి, యూనియన్ నేతలు రఘురావమ్మ, సుభాషిణి, విజయలత తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేపట్టిన సమ్మె 37వ రోజుకు చేరింది. బుధవారం వారు విధులను బహిష్కరించి ఆత్మకూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో భైఠాయించి సమ్మె కొనసాగించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కమిటీ ప్రధాన కార్యదర్శి పి రాధ, పలువురు సెక్టార్ లీడర్లు కె రమణమ్మ, కామేశ్వరి, జమీల, విజయలక్ష్మీ, రూతమ్మ, విజయలక్ష్మీ, శ్రీదేవి, ఏ మస్తానమ్మ, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు కాకు వెంకటయ్య పేర్కొన్నారు. బుధవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో అంగన్‌వాడీలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారానికి రోజుల తరబడి అంగన్‌వాడీల సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా సీఎం జగన్ నిర్లక్ష్యాన్ని వీడి మంత్రివర్గ సమావేశం నిర్వహించి పాదయాత్రలో ఇచ్చిన హామీ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫరుద్దీన్‌బాషా, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



వరికుంటపాడు: విరాళం అందజేస్తున్న మధుసూదనరావు

● అంగన్‌వాడీలకు విరాళం

వరికుంటపాడు: స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలకు బుధవారం టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు ఆధ్వర్యంలో నాయకులు మద్దతుగా నిలిచి సంఘీభావం ప్రకటించారు. వారితోపాటు ఆందోళన చేపట్టారు. అనంతరం తమవంతు దాతృత్వంగా రూ. 20వేల నగదును అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు షేక్ రజియాకు అందజేశారు. కార్యక్రమంలో చంద్ర ఉమామహేశ్వరరావు, ముజ్జి లక్ష్మినారాయణ, చంద్ర వెంకయ్య, పోలిబోయిన శ్రీకాంత్ పోకా మహేష్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షితల పంపిణీ



అక్షితలు పంపిణీ చేస్తున్న నేతలు

ఆత్మకూరు, జనవరి 17 : అయోధ్యలో శ్రీరామ మందిరం ఈనెల 22న అంగరంగ వైభవంగా ప్రారంభమవుతున్న సందర్భంగా అయోధ్య నుంచి వచ్చిన అక్షితలను ప్రతి ఇంటికీ చేర్చే కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని గిరిజన కాలనీలో ప్రతి ఇంటికీ బీజేపీ నేతలు వెళ్లి అందజేశారు. ముందుగా బీజేపీ నేతలు, రామ భక్తులు, కాలనీవాసులు కోదండరామాలయం వద్ద పూజలు నిర్వహించి అనంతరం అక్షితల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, సోమవరపు యానాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల మూతతో చిన్నారుల అవస్థలు



మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్మకూరు నాగయ్య

ఆత్మకూరు, జనవరి 17: అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల సమ్మెతో కేంద్రాలు మూతపడడంతో చిన్నారులు అవస్థలు పడుతున్నారని, ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో చిన్నారులు, గర్భిణుల పరిస్థితి దారుణంగా తయారైందని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్మకూరు నాగయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాల్టీ పరిధిలోని వెంకట్రావుపల్లి గిరిజన కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి కాలనీవాసులతో మాట్లాడారు. ఉదయాన్నే పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో వదిలి పనికివెళ్లి మధ్యాహ్నం వచ్చే వరకు పిల్లలకు మంచి ఆహారం అందిస్తూ రక్షణగా ఉండేవారని ప్రస్తుతం అంగన్‌వాడీలు సమ్మెలో ఉండడంతో పిల్లలను కేంద్రాలకు పంపడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీపై శిక్షణ

ఉదయగిరి రూరల్, జనవరి 17: స్థానిక స్త్రీశక్తి భవనంలో బుధవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, డిజిటల్ సహాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలకు రెండు రోజులపాటు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీవో ఈశ్వరమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు తయారు చేసుకుని అమలుపర్చాలన్నారు. పంచాయతీల్లో సమన్వయంతో ప్రణాళికలు రూపొందించుకుని 25వ తేదీన గ్రామసభలు నిర్వహించాలన్నారు. 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మల్లికార్జున, ఏవో సీహెచ్ రేణుకా, ఎంసీవో గాజుల ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆటల పోటీల ప్రారంభం

సీతారామపురం, జనవరి 17: ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల స్థాయిలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో భార్గవి పర్యవేక్షణలో క్రీడాకారులకు ఆటల పోటీలు నిర్వహించారు. మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామంలో ఏర్పాటుచేసిన క్రీడా మైదానాలలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యవారిపల్లి సర్పంచ్ దుర్గాప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు గోవర్దన్‌రెడ్డి, రామనాథ్ రెడ్డి, డిజిటల్ అసిస్టెంట్ రమేష్, ఖలీల్ పాల్గొన్నారు.

గ్రామాల్లో వికసిత్ భారత్



ఉదయగిరి రూరల్ : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఈశ్వరమ్మ

ఉదయగిరి రూరల్, జనవరి 17: మండలంలోని జీ.చెర్లోపల్లి, జీ.చెరువుపల్లి గ్రామాల్లో బుధవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఈశ్వరమ్మ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు ఎంఈవో టీ శ్రీనివాసులు, వినీత, తేజస్విని, ఖాజారంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం: కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన ఉండాలని మండల విద్యాశాఖాధికారి-2 ఆనందరావు అన్నారు. వికసిత్ భారత్ సంకల్పయాత్రను అధికారులు బుధవారం చింతలదీవిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ ప్రాంతాల్లోని పేదవారికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి నసీరుద్దీన్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు ఐక్యతకు దోహదం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ షకీల

ఆత్మకూరు, జనవరి 17 : క్రీడలు ఐక్యతకు దోహదపడతాయని బిఎస్ఆర్ వైద్యశాల అధినేత డాక్టర్ షకీల తెలిపారు. ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ఆటల పోటీలు బుధవారం ముగిసాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని క్రికెట్, షటిల్ తదితర పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గంటా లక్ష్మీపతి, కొప్పోలు డేవిడ్‌రాజు, సీఐటీయు జిల్లా నాయకుడు జి శివప్రసాద్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ షేక్ సందాని, రెడ్‌క్రాస్ ఛైర్మన్ సాదిక్‌హుస్సేన్, డీవైఎఫ్ఐ నాయకులు నందా శ్రీను, పొడమేకల శ్రీనివాసులు, శ్రీకాంత్, ఆళ్ల హజరత్తయ్య, యూటీఎఫ్ నాయకులు మురళీకృష్ణ, హరికృష్ణ, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యుత్ అక్రమ కనెక్షన్‌కు మహిళ బలి

● సంఘటనా స్థలాన్ని సందర్శించిన డీఎస్పీ



మృతి చెందిన కొండమ్మ

లింగసముద్రం, జనవరి 17 : అక్రమంగా విద్యుత్ వాడుతూ, విద్యుత్ సరఫరా ఉన్న ఓ కేబుల్‌ను నిర్లక్ష్యంగా పడేయడంతో, దానిని పక్కకు తీసే క్రమంలో ఓ మహిళ విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని మొగిలిచెర్ల ఆదిఆంధ్ర కాలనీ ఎదురుగా ఉన్న పొలాల్లో బుధవారం జరిగింది. ఆ కాలనీకి చెందిన యనదాసరి కొండమ్మ (55) మృతి చెందింది.కందుకూరు డీఎస్పీ ఏ రామచంద్ర సమాచాం మేరకు.. అదే గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు తమ పొగాకు పైరుకు సాగునీటి కోసం ఆదిఆంధ్ర కాలనీ ఎదురుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అక్రమంగా కేబుల్ తగిలించి, వారి బావి వద్ద ఉన్న విద్యుత్ మోటారుకు కనెక్షన్ ఇచి నీరు పారించుకున్నారు. అయితే నీరు పారించుకున్న తరువాత మోటారు నుంచి కేబుల్‌ను తీసి పక్కన ఉన్న కొండమ్మ పొలంలో వేసి, ట్రాన్స్‌ఫార్మర్‌లో నుంచి కేబుల్ కనెక్షన్ తీయకుండా వెళ్లిపోయారు. అయితే కొద్దిసేపటి తరువాత కొండమ్మ తన పొలంలో వేసిన జొన్నమేత పైరుకు మందు చల్లేందుకు వచ్చి చేలో ఉన్న కేబుల్‌ను పక్కకు తీయబోగా, కేబుల్‌కు ఉన్న కొక్కెం మెడకు తగిలి విద్యుదాఘాతానికి గురై పెద్దగా కేకలు వేసింది. అయితే ఆమె కుమారుడు చిన్న, కుమార్తె లుథియాలు ఆమెను కాపాడబోగా కరెంటు షాక్ తగిలింది. అయితే అక్కడే ఉన్న కొందరు కేబుల్‌ను తప్పించారు. అప్పటికే కొండమ్మ మృతి చెందింది. ఈ సంఘటనతో కొండమ్మ కుమారులు, కుమార్తె కన్నీరు మున్నీరుగా విలపించారు. కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు ఆ ఇద్దరు రైతులపై కొండమ్మ కుమార్తె కంచుపాటి లుథియా పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో సాయంత్రం కందుకూరు డీఎస్పీ ఏ రామచంద్ర, ఇన్‌చార్జ్ సబ్ ఇన్‌స్పెక్టర్ మహేంద్రనాయక్‌లు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. సంఘటనకు గల కారణాలను పరిశీలించి, కొండమ్మ బంధువులు, స్థానికుల నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. అనంతరం కొండమ్మ మృతదేహానికి పోస్ట్‌మార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై ఎస్సీ ఎస్టీ కేసు కూడా నమోదు చేసినట్టు డీఎస్పీ రామచంద్ర చెప్పారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయం



కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మహేంద్ర రెడ్డి

కావలిటౌన్, జనవరి 17: మహిళల ఆర్థిక స్వావలంబనే ధ్యేయంగా నెహ్రూ యువకేంద్రం పనిచేస్తుందని ఆ కేంద్రం యూత్ అధికారి మహేంద్రరెడ్డి పేర్కొన్నారు. మీకోసం స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ముసునూరు ఇందిరమ్మ కాలనీలో కుట్టు శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. సంస్థ అధ్యక్షుడు దిలీప్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మహేంద్రరెడ్డి మాట్లాడుతూ మహిళల స్వయం ఉపాధి కోసం అనేకం అవకాశాలు ఉన్నాయని, వాటిలో ఒకటి ఎన్నుకుని స్వచ్ఛంద సంస్థల ద్వారా అందించే ఉచిత శిక్షణ కార్యక్రమాల్లో శిక్షణ పొంది స్వయంగా ఆర్థిక పరిపుష్టి సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జేడీ ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ మాకినేని అరుణ, విశ్రాంత తహసీల్దారు సిరాజ్ మొగల్, చేవూరి చిన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు వినికిడి యంత్రాల పంపిణీ

కందుకూరు, జనవరి 17: రామయ్య ఫౌండేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో మండలంలోని వృద్ధులకు ఇటీవల పరీక్షలు నిర్వహించి వినికిడి యంత్రాలు కోసం ఎంపిక చేసిన వారికి గురువారం ఉదయం వాటిని పంపిణీ చేయనున్నట్లు ట్రస్టు అధ్యక్షురాలు, టీడీపీ నాయకురాలు ఉన్నం నళినీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాద్రిపాలెం కమ్యూనిటీ హాలులో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో స్క్రీనింగ్ టెస్టుకు హాజరై పేర్లు నమోదు చేసుకున్నవారంతా వచ్చి వినికిడి యంత్రాలు తీసుకెళ్లాలని ఆమె కోరారు.

తైక్వాండో జిల్లా జట్టుకు నేడు ఎంపికలు

కందుకూరు, జనవరి 17: నెల్లూరు జిల్లా సబ్‌జూనియర్ తైక్వాండో బాలబాలికల పోటీలు ఈనెల 18న స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంటు, మాస్టర్ ఎస్కే అబ్దుల్ సలాం, జిల్లా కార్యదర్శి పి.అఖిల్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు ఉదయం 9 గంటలకు నేరుగా పోటీలకు హాజరుకావచ్చని, పతకాలు సాధించిన తైక్వాండో క్రీడాకారులు ఈనెల 20, 21 తేదీలలో నంద్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు.

24న వాహనాల బహిరంగ వేలం

కావలి రూరల్, జనవరి 17: కావలి ప్రాంతీయ రవాణాశాఖ కార్యాలయ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడ్డ వాహనాలకు ఈ నెల 24వ తేదీ ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం వేయనున్నట్లు ఆర్టీవో వై.సుధాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మండవ వెంకట్రావుకు సేవా పురస్కారం



మండవ వెంకట్రావును సత్కరిస్తున్న విశ్రాంత డీజీపీ

కావలిటౌన్, జనవరి 17: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండవ కుటింబీకులు ప్రతిఏటా విజయవాడలో నిర్వహించే కార్యక్రమంలో భాగంగా బుధవారం కావలికి చెందిన దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ నాయకుడు మండవ వెంకట్రావును ఉత్తమ సేవాపురస్కారంతో సత్కరించారు. విశ్రాంత డీజీపీ మండవ విష్ణువర్ధన్, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, మండవ కుటుంబ సభ్యుల అధ్యక్షుడు మండవ ప్రభాకర్ తదితర ప్రముఖులు మండవ వెంకట్రావు దివ్యాంగులకు అందిస్తున్న సేవలను కొనియాడి సత్కరించి అభినందించారు.

జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు



పోకూరులో ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న టీడీపీ నేతలు

వలేటివారిపాలెం, జనవరి 17 : జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ప్రకాశం జిల్లా టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ నూకసాని బాలాజీ తెలిపారు. మండలంలోని పోకూరులో ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని బుధవారం రాత్రి 8 గంటలకు ఆవిష్కంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో తెలుగు వారికి గుర్తింపు తెచ్చింది ఎన్టీఆర్ అన్నారు. రాష్ట్రంలో మళ్లీ రామరాజ్యం రావాలంటే చంద్రబాబును సీఎం చేసుకోవాలన్నారు. రాబోయే ఎన్నికల యుద్ధంలో రాక్షస సంహారం జరగాలన్నారు. టీడీపీని స్థాపించి ఎంతో మందికి రాజకీయ అవకాశాలు కల్పించింది ఎన్టీఆర్ అని తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, వైసీపీ ప్రభుత్వం పనితీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఒక గజదొంగకు ఒక్క చాన్స్ ఇవ్వడమే పెద్ద తప్పు అని దాని ఫలితమే ఇప్పుడు అనుభవిస్తున్నామని, మరోసారి జగన్‌కు ఓటు వేస్తే మనలను మనమే మోసం చేసుకున్నట్లు అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరావు, ఒంగోలు మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, కనిగిరి, కందుకూరు మాజీ ఎమ్మెల్యేలు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, డాక్టర్ దివి శివరాం, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, చీరాల ఇన్‌చార్జీ ఎంఎం కొండయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి ఎం. రాజేష్, నాయకురాలు ఉన్నం నళినీదేవి, ఎం.లక్ష్మీనరసింహం, ఆర్. సుబ్బారావు, జే నాగరాజు డీ నాగమల్లేశ్వరావు, ఎన్ రోశయ్య, జీ చెంచురామయ్య పాల్గొన్నారు.

రంగా విగ్రహ ప్రతిష్ఠకు స్థల పరిశీలన

కావలి, జనవరి 17: వంగవీటి మోహన్ రంగా విగ్రహ ప్రతిష్ఠకు కాపు నాయకులు కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డితో కలిసి బుధవారం సాయంత్రం స్థల పరిశీలన చేపట్టారు. పట్టణంలోని రైతు బజారు వద్ద శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి ఎదురుగా రంగా విగ్రహం ఏర్పాటు చేయాలని కాపులు విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాపులతా కలిసి రంగా విగ్రహ ప్రతిష్ఠకు సహకరించాలని ఇటీవల తనను కలిసి కోరారన్నారు. దీంతో ఈ రోజు వారితో కలిసి స్థల పరిశీలన చేశామన్నారు. అయితే రైతు బజారు ఎదురు రద్దీ ప్రదేశం కావటంతో ఎవరికి ఇబ్బందులు లేకుండా ఇక్కడ విగ్రహ ప్రతిష్ఠకు అధికారులు అనుమతులు ఇచ్చే విధంగా తనవంతు సహకరిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాపు నాయకులు దేవరకొండ శ్రీనివాసులు, దామిశెట్టి శ్రీనివాసులు నాయుడు, మండలి కృష్ణారావు, నాగిశెట్టి మాలకొండయ్య, వెంకటేశ్వర్లు, అళహరి చిట్టిబాబు, బండారు మహేష్, నున్నా మురళీ, సుదాకర్, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన



టీడీపీలోకి ఆహ్వానిస్తున్న మధుసూదనరావు

వరికుంటపాడు, జనవరి 17: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన సాగుతోందని టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు అన్నారు. బుధవారం స్థానిక బస్టాండ్ సెంటర్ సమీపంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీ పీకి బ్రహ్మరథం పట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం వైసీపీకి చెందిన మాజీ సర్పంచు గుంటుపల్లి అనురాధ, వెంగమనాయుడు దంపతుల ఆధ్వర్యంలో పార్టీలో చేరిన కార్యకర్తలను పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అలాగే తిమ్మారెడ్డిపల్లికి చెందిన ఆ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ చేవూరి రవితేజ, ముస్లీం మైనార్టీ నాయకులు రసూల్ తదితరులు స్వచ్ఛందంగా పార్టీలో చేరి మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు చంద్ర వెంకయ్య, పోకా మహేష్, పాలకొల్లు విజయభాస్కర్‌రెడ్డి, మానం కొండలరావు, ముజ్జె లక్ష్మినారాయణ, పోలిబోయిన శ్రీకాంత్, గోళ్ల వెంగళరావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న గురువులు, పూర్వ విద్యార్థులు

మర్రిపాడు, జనవరి 17: స్థానిక హైస్కూల్ ఆవరణలో 2007-08 బ్యాచ్‌కి చెందిన 10వ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం జరిగింది. సంక్రాంతి పండుగ సందర్భంగా స్వగ్రామాలకు వచ్చి గురువులను ఆహ్వానించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు సుధాకర్, చలమయ్య, ఈశ్వర్‌రెడ్డి, ప్రభాకర్, సుధాకర్, గురునాథం, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రాపౌట్స్ విద్యార్థుల కోసం ఆర్థిక సహాయం



డైరీ ఆవిష్కరిస్తున్న రజక విద్యా సేవా సంఘం ప్రతినిధులు

కందుకూరు, జనవరి 17: చదువుకోవాలన్న ఆసక్తి ఉన్నా కుటుంబ ఆర్థిక సమస్యల కారణంగా చదువు మధ్యలోనే ఆపేసిన విద్యార్థులను తిరిగి చదువుకునేలా ప్రోత్సహించడం కోసం రజక విద్యా సేవాసంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. పట్టణంలోని చాకలిపాలెం రామాలయం వద్ద గురువారం సంఘం డైరీని విశ్రాంత ఎంపీడీఓ కె. మాలకొండయ్య, టీటీఏ నాయకుడు కె.మోహనరావు తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక కారణాలతో చదువు మానేసిన వారు ఎవరైనా విద్య కొనసాగింపునకు ఆసక్తి చూపితే వారి వివరాలు తెలపాలన్నారు. అలాగే పదవ తరగతిలో మంచిమార్కులు సాధించిన రజక విద్యార్థులకు రూ.5వేల ప్రోత్సాహక బహుమతిని అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కె.యలమంద, కేవై కోటయ్య, కె.వెంకటేశ్వర్లు, మంచికలపాటి వెంకటేశ్వర్లు, కె.రవి, కె.మాలకొండయ్య, పి.బ్రహ్మయ్య, బీవీ కాశీరత్నం తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాల మంజూరు

వరికుంటపాడు, జనవరి 17: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం జీ.కొండారెడ్డిపల్లి, జీ.కొత్తపల్లి, నేలటూరు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. అంబేద్కర్, వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ ఛైర్మన్ అలీఅహమ్మద్, కన్వీనర్ తిరుపతినాయుడు, జట్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, సర్పంచ్ కుమ్మిత ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీ దేవనబోయిన మధు, మాగంటి. సిద్ధయ్య, ఎంపీడీవో శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో సహకరించాలి

ఉదయగిరి రూరల్ : మండలంలోని పుల్లాయపల్లి గ్రామంలో బుధవారం వైసీపీ నాయకులతో నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని బెంగళూరు, హైదరాబాదు తదితర ప్రాంతాల్లో ఉన్నవారు స్వగ్రామానికి రావడంతో వారిని కలిసి జరగనున్న ఎన్నికల్లో తనకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి, మండల వైసీపీ కన్వీనర్లు జీ ఓబులరెడ్డి, సీహెచ్ సుబ్బారెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యులు తాజుద్దీన్, సొసైటీ అధ్యక్షుడు కల్లూరి రమణారెడ్డి, నాయకులు కంభాల భాస్కర్‌రెడ్డి, మూలె సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఓట్ల తొలగింపునకు కారణమైన వ్యక్తిపై చర్య తీసుకోవాలి

● తహసీల్దారుకి టీడీపీ, జనసేన నేతల వినతి



తహసీల్దారుకి వినతి పత్రం అందజేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

సీతారామపురం, జనవరి 17 : ఉదయగిరి నియోజకవర్గం సీతారామపురం మండల పరిధిలోని నెమళ్లదిన్నె గ్రామ పంచాయతీలో పోలింగ్ బూత్ నెంబర్- 19లో ఓ వైసీపీ నాయకుడు ఫామ్ -7 ఉపయోగించి టీడీపీ, జనసేన మద్దతుదారులైన సుమారు 52 ఓట్లు తొలగించటానికి ప్రయత్నించడాన్ని ఖండిస్తూ అతనిపై చర్య తీసుకోవాలని మండలంలోని టీడీపీ, జనసేన నాయకులు మండల తహసీల్దారుకి వినతిపత్రం అందజేశారు. దీంతో తహసీల్దారు స్పందిస్తూ ఓట్లు తొలగింపునకు కారణమైన వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదు చేయడం జరిగిందని, పోలీసుల విచారణ జరుగుతోందని తెలిపారు. ఈకార్యక్రమంలో జనసేన పార్టీ ఉదయగిరి నియోజకవర్గ నాయకుడు బోగినేని కాశీరావు, టీడీపీ మండల కన్వీనర్ కప్ప ప్రభాకర్‌రాజు, నెమళ్లదిన్నె గ్రామపంచాయతీ సర్పంచ్ తోకల రామచంద్ర, టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, జనసేన పార్టీ మండల ఇన్‌చార్జి పాలిశెట్టి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి అల్లూరి రవీంద్ర, పోకలపుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ పగిలి వృథాగా పోతున్న నీరు!



పెంట్రాల ఎస్సీ కాలనీ వద్ద పైపులైన్ పగిలి వృథాగా పోతున్న నీరు

లింగసముద్రం, జనవరి 17 : మండలంలోని పెంట్రాల ఎస్సీ కాలనీ వద్ద రోడ్డు పక్కనే ఉన్న మంచినీటి పైపులైన్ పగిలిపోయి నీరు వృథాగా పోతోంది. వారం రోజుల క్రితం ఈ పైపులైన్ పగిలిందని స్థానికులు అంటున్నారు. మొగిలిచెర్లలోని చుండి-చెర్లోపాలెం మంచినీటి పథకానికి సంబంధించిన మంచినీటి పైపులైన్ పగిలి నీరు వృథాగా పోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

పేకాటరాయుళ్ల వద్ద పెద్దమొత్తంలో నగదు స్వాధీనం?

● నామమాత్రంగా చూపించి, కేసులు నమోదు చేసిన పోలీసులు

కందుకూరు, జనవరి 17: సంక్రాంతి పర్వదినం సందర్భంగా కందుకూరు ప్రాంతంలోని వివిధ ప్రాంతాల్లో జూదరులపై పోలీసులు జరిపిన దాడుల సందర్భంగా భారీగా చేతివాటం ప్రదర్శించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారంతా పలు ప్రాంతాలలో జూదం ఆడటంతో పాటు వలేటివారిపాలెం మండలం శాఖవరం వద్ద పేకాట స్థావరం, కందుకూరు పట్టణంలోని ఓ హోటల్‌లో, ఏకలవ్యనగర్, మండలంలోని పలుకూరులలో కూడా పేకాటస్థావరాలపై పోలీసులు దాడులు చేశారు. పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. అయితే శాఖవరం వద్ద నిర్వాహక పేకాట కావడంతో కందుకూరు పరిసర ప్రాంతాలతో పాటు గుడ్లూరు, కొండపి తదితర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో కోతముక్క పేకాటరాయుళ్లు అక్కడకు చేరి జూదం ఆడుతుండగా పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. అక్కడ రమారమి 40 మంది వరకు జూదరులు పోలీసులు దాడి చేసిన సమయంలో ఉండగా పదిమంది మాత్రమే పట్టుబడ్డారు. మిగిలిన వారిలో కొందరు పోలీసుల నుంచి తప్పించుకునేందుకు డబ్బులు విసిరేసి పరారైనట్లు తెలిసింది. సంక్రాంతి పర్వదినం రోజున పోలీసులు దాడిచేసినప్పటికీ సమాచారం మంగళవారం వెలుగులోకి వచ్చింది. అయితే మొత్తంగా అక్కడ పది లక్షల రూపాయలకు పైగా పట్టుబడగా పోలీసులు కేవలం లక్షా 90వేల రూపాయలు మాత్రమే దొరికినట్లు చూయించటంపై విమర్శలు వినిపిస్తున్నాయి. దొరికిన మొత్తంలో నాలుగోవంతు కూడా చూయించలేదని చెబుతున్నారు.

సోమశిలలో 29.639 టీఎంసీల నీరు

అనంతసాగరం, జనవరి 17: సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, బుధవారం నాటికి 29.639 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. డెల్టాకు 2,350, ఉత్తర కాలువకు 500, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వారు తెలిపారు.

'గడప గడప'కు పనులు పూర్తి చేయాలి : ఎమ్మెల్యే

కావలి, జనవరి 17: కావలి పట్టణంలో గడపగడప కార్యక్రమంలో గుర్తించిన పనులకు నిధులు మంజూరైన పనులు ఎట్టి పరిస్థితిలోనూ పూర్తి చేయాల్సిందేనని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గడపగడప పనుల పురోగతిపై బుధవారం సాయంత్రం ఆయన మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్, ఇంజనీరింగ్ అధికారులు, వైసీపీ వార్డు ఇన్‌చార్జీలతో సమీక్షించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో గడపగడప కార్యక్రమం పూర్తి అయిందని, ఆ కార్యక్రమంలో మున్సిపాల్టీలోని 28 సచివాలయాల పరిధిలో రూ.12 కోట్లు మంజూరు చేయడమే కాక వాటికి అనుమతులు కూడా వచ్చాయన్నారు. ఇప్పటి వరకు ఎన్ని పనులు చేపట్టారు వాటిలో ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి వాటిని ఎప్పుడు పూర్తి చేస్తారని ఇంజనీరింగ్ అధికారులను ప్రశ్నించారు. అలాగే విజయవాడలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని అద్భుతంగా నిర్మించారని, దానిని ఈ నెల 19వ తేదీన ప్రారంభించనున్నందన ఈ కార్యక్రమానికి కావలి నియోజకవర్గం నుంచి ప్రజలు తరలి రావాలన్నారు.

కుక్కల స్వైరవిహారం!

● చిన్నా, పెద్ద తేడా లేకుండా దాడులు ● గాయాలతో ఆసుపత్రిపాలు ● బెంబేలెత్తుతున్న జనం

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 17: బుచ్చిరెడ్డిపాళెం పట్టణంతోపా టు మండలంలో అడుగ డు గున వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. చిన్నా, పెద్ద తేడా లేకుండా దాడులు చేసి గాయపరు స్తున్నాయి. బుచ్చి-జొన్నవాడ, బుచ్చి-చెన్నూరు, బుచ్చి- నెల్లూరు ప్రధాన మార్గాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కుక్కలు వాహనచోదకుల వెంటబడిస్తూ బెంబేలెత్తిస్తున్నాయి. రాత్రి వేళల్లో మహిళలతో కలసి వెళ్తున్న వాహన చోదకులు కుక్కల దాడితో ప్రమాదాలకు గురతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కుక్కలు పెద్ద కోళ్లను సైతం కాపుకాసి వేటాడి చంపి పీక్కుతింటున్నాయి. ఇలా చంపి తినేందుకు అలవాటుపడిన కుక్కలు వీధుల్లో రాకపోకలు సాగించే పిల్లలు, పెద్దలపైన తిరగబడుతూ దాడి చేస్తున్నాయి. దీంతో జనాలు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో పంచాయతీలు, మున్సిపాలిటీలలో కుక్కల ధాటిని నివారించే నిమిత్తం కక్కల బండి తీసుకువచ్చి వాటి ఉత్పత్తి పెరగకుండా చేయడం, ఒక వేళ కుక్కలు కరిచినా వాటి దాడిలో గాయపడ్డ జనాలకు ఎలాంటి ప్రమాదలు తలెత్తకుండా ఉండేలా వెటర్నరీ శాఖ ఇంజక్షన్లు వేసేవారు. కొన్నేళ్లుగా ఆ చర్యలకు కూడా స్వస్తి పలికేశారని ప్రజల్లో విమర్శలు ఉన్నాయి. కూలి చేసుకుంటేనే కుటుంబాన్ని పోషించుకునే ఎంతో మంది నిరుపేదలు కుక్కలదాడికి గురై వైద్య చికిత్స కోసం ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. దీంతో పనులు లేక కుటుంబ పోషణ కరువవుతోందని పలువురు నిరుపేదలు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా చేపల గుంతల్లో వ్యర్థాలను తినేందుకు అలవాడు పడిన కుక్కలు వేటాడే జంతువులుగా తయారయ్యాయి. అదే విధంగా నేటి సమాజంలో పట్టణ, గ్రామీణ ప్రాంతల్లో గేదె దూడలు మృత్యువాత పడితే వాటిని రోడ్లు పక్కన పడేస్తున్నారు. దీంతో వాటిని కుక్కలు పీక్కు తింటున్నాయి. ఇలా పచ్చి మాంసాలకు అలవాటుపడుతున్నాయి.


జొన్నవాడ ఆలయం ముందు కుక్కలు


కుక్కల దాడిలో గాయపడిన మహిళ(ఫైల్)

ఆరు నెలల్లో కాలువ పూర్తిచేసి చూపిస్తా..

మనుబోలు, జనవరి 17: వచ్చే ఎన్నికల్లో ప్రజలు తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఆరునెలల్లో డేగపూడి-బండేపల్లి కాలువ పూర్తిచేసి రైతులకు సాగునీరు అందిస్తామని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి సవాల్ విసిరారు. బుధవారం మనుబోలు టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టీడీపి విజయం ఖాయమన్నారు. అధినేత చంద్రబాబు నాయుడు ప్రతి పార్లమెంటరీ నియోజకవర్గంలో రా.. కదలిరా పేరుతో సభలను నిర్వహిస్తున్నారని, ఆ సభలను విజయవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శివప్రసాద్, టీడీపీ నాయకులు బొమ్మి సురేంద్ర, గాలి రామకృష్ణారెడ్డి, నాయకులు పొన్నూరు రామకృష్ణయ్య, తిరుపతి పార్లమెంట్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల వద్ద పెద్దమొత్తంలో నగదు స్వాధీనం?

కందుకూరు, జనవరి 17: సంక్రాంతి సందర్భంగా కందుకూరు ప్రాంతంలోని వివిధ ప్రాంతాల్లో జూదరులపై పోలీసులు జరిపిన దాడుల సందర్భంగా భారీగా చేతివాటం ప్రదర్శించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వలేటివారిపాలెం మండలం శాఖవరం వద్ద పేకాట స్థావరం, కందుకూరు పట్టణంలోని ఓ హోటల్‌లో, ఏకలవ్యనగర్, మండలంలోని పలుకూరులలో కూడా పేకాటస్థావరాలపై పోలీసులు దాడులు చేశారు. పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. అయితే శాఖవరం వద్ద నిర్వాహక పేకాట కావడంతో కందుకూరు పరిసర ప్రాంతాలతో పాటు గుడ్లూరు, కొండపి తదితర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో కోతముక్క పేకాటరాయుళ్లు అక్కడకు చేరి జూదం ఆడుతుండగా పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం.అయితే మొత్తంగా అక్కడ పది లక్షల రూపాయలకు పైగా పట్టుబడగా పోలీసులు కేవలం రూ.1. 90లక్షలు మాత్రమే దొరికినట్లు చూయించటంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

మెడికవర్‌లో బోన్‌మ్యారో శస్త్రచికిత్స విజయవంతం


మాట్లాడుతున్న డాక్టర్ రంగరాజన్

నెల్లూరు (వైద్యం) జనవరి 17 : నగరంలోని మెడికవర్ ఆసుపత్రి లో బోన్‌మ్యారో మార్పిడి శస్త్రచికిత్సను వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం ఆసుప త్రిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ రంగరాజన్ మాట్లా డుతూ కర్నూలు జిల్లాకు చెందిన గోవిందమ్మ అనే మహిళ కేన్సర్ వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చిందన్నారు. ఆమెకు పరీక్షలు చేసి బోన్‌మ్యారో మార్పిడి శస్త్రచికిత్స చేయించుకుంటే కేన్సర్ పూర్తిగా నియంత్రణలోకి వస్తుందని చెప్పామన్నారు. ఇందుకు రూ.8 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు ఖర్చవుతుందని వివరించామని తెలిపారు. అయితే ఆమె ఆర్థిక పరిస్థితి బాగా లేక పోవటంతో ఆరోగ్యశ్రీ పథకం కింద శస్త్రచికిత్సను పూర్తి చేశామన్నారు. కేన్సర్ ఆసుపత్రి హెడ్ డాక్టర్ బిందురెడ్డి మాట్లాడుతూ బోన్‌మ్యారో మార్పిడి శస్త్రచికిత్సలు అవసర మైన వారు దూరప్రాంతాలకు వెళ్లకుండా మెడికవర్ ఆసుపత్రి కేన్సర్ విభాగంలోనే సేవలు అందిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో బాధితురాలు గోవిందమ్మ, ఆమె కూతురు పాల్గొన్నారు.

వరిలో 'వెన్నుపోటు'

- నాటిన 25 రోజులకే వెన్నుతీస్తున్న ఆర్ఎన్ఆర్ రకం
- తాజాగా రబీలో కేఎన్ఎం రకం వెలుగులోకి
- పగటి ఉష్ణోగ్రతల తగ్గుదలే కారణం
- సాగుదారుల ఆందోళన

నెల్లూరు రూరల్, జనవరి 17 : నెల్లూరు రూరల్‌లోని పల్లెల్లో ప్రధాన పంటలుగా పోటాపోటీగా సాగులో ఉన్న వరి ఆర్ఎన్ఆర్15048, కేఎన్ఎం 1638 సన్నారకాలు తక్కువ రోజులకే వెన్నుతీస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి నారుమళ్లను పొలాల్లో నాటిన 60 రోజులకు వెన్ను తీయాల్సి ఉండగా 25 రోజులకే ఈ రెండు రకాలు వెన్ను తీస్తుండటం రైతాంగానికి కంగారు పుట్టిస్తోంది. వాతావరణ ప్రతికూలతతో ఏర్పడిన ఈ సమస్య దిగుబడులపై ప్రభావం చూపుతుందేమోనన్న ఆందోళన అన్నదాతల్లో నెలకొంది. కాగా, పగటి ఉష్ణోగ్రతలు పడిపోవడం వల్లే ఇలాంటి పరిస్థితులు వరిపంటలో ఏర్పడినట్లు వ్యవసాయ శాఖ అధికారులు నిర్ధారించారు.

ఈ సారిలో రబీ వ్యవసాయ సీజన్‌లో సాగునీటి కొరత ఉన్నప్పటికీ ఆయకట్టు, లోతట్టు ప్రాంతాల్లో మెజార్టీ స్థాయిలో వరి పంటనే సాగులోకి తీసుకువచ్చిన రైతులు తొలి ప్రాధాన్యత రకాలుగా ఆర్ఎన్ఆర్, కేఎన్ఎంలను పండిస్తున్నారు. ఇవి పూర్తిగా సన్నరకాలు కావడంతో అమ్మకాల్లో గిట్టుబాటు ఉంటుందని భావించిన రైతులు నెల్లూరు రూరల్‌లోని దాదాపుగా అన్ని గ్రామాలలో వరినాట్లు పూర్తి చేశారు. 25 రోజుల పంట పొలాల్లో ఉంది. గతేడాది ఎడగారు, రబీల్లో ఆర్ఎన్ఆర్ రకం తక్కువ రోజులకే వెన్ను తీయగా, ఈ సారి కేఎన్ఎం రకం కూడా అదే బాటలో ఉండటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. నారుమళ్లతో సంబంధం లేకుండా నాటిన 60 రోజులకు వెన్ను తీయాల్సిన పైర్లు 25 రోజులకే వెన్ను తీస్తుండటంతో అన్నదాతలకు కంగారుపట్టుకుంది. ఇలాంటి సందర్భాలు ఇప్పటి వరకు ఎప్పుడు చూడకపోవడంతో తొలత విత్తనాలపై అనుమానం వ్యక్తమైంది. అనంతరం అన్ని గ్రామాలలో ఇదే పరిస్థితి ఉండటంతో వాతావరణ ప్రతికూలతే కారణంగా భావిస్తున్నారు. అందులోనూ తల్లికర్ర వెన్ను తీస్తుండటం మరింత ఆందోళన కలిగిస్తున్నది.

పగటి ఉష్ణోగ్రత లోపమే కారణం

వరి సాగులో తలెత్తిన ప్రతికూల పరిస్థితులకు పగటి పూట ఉష్ణోగ్రతలు పూర్తిగా పడిపోవడమే కారణంగా వ్యవసాయ శాఖ అధికారులు భావిస్తున్నారు. గతేడాది ఆర్ఎన్ఆర్ రకం రబీ, ఎడగారులో అక్కడక్కడ ఇలాగే తక్కువ రోజులకు వెన్నుతీయడాన్ని గుర్తించిన అధికారులు తాజాగా కేఎన్ఎం రకం కూడా అలాగే సాగవడం గుర్తించారు. ఇందుకు పంటపై మెరుగైన కాంతి లేకుండా మంచు, చలి, గాలిలో తేమ శాతం పెరిగిపోవడం, వేడి పూర్తిగా దూరమవడమే కారణంగా అంచనా వేశారు. రాబోవు రోజుల్లో ఎండలు పెరిగే అవకాశం ఉండటం వల్ల రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచిస్తున్నారు.


తక్కువ రోజులకే వెన్ను తీసిన ఆర్ఎన్ఆర్ రకం పైరు

ముదురు నారు వేయడమూ కారణమే..

తక్కువ రోజులకే వరి పైర్లు వెన్ను తీయడానికి ముదురు నారు వేయడం కూడా ఓ కారణం. పైర్లకు పూర్తిగా పగటి ఉష్ణోగ్రత లేదు. రైతులెవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇలాంటి పైర్లకు బూస్టర్ డోస్‌గా యూరియాని 25 కేజీలు వేస్తే సరిపోతుంది. పైగా సంక్రాంతి దాటింది కాబట్టి ఎండలు పెరిగే అవకాశం ఉంది. పైర్లు యథాస్థితికి చేరుతాయి.

- శివన్నారాయణ, ఆత్మ డీపీడీ

గొబ్బెమ్మల పండుగను వైసీపీ పండుగగా మార్చారు : మనుక్రాంత్


గాలి పటం ఎగురవేస్తున్న మనుక్రాంత్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట),జనవరి 17: నగరంలో నాలుగేళ్లుగా గొబ్బెమ్మల పండుగను కేవలం వైసీపీ పండుగగానే నిర్వహిస్తున్నారని, వచ్చే సంవత్సరం జనసేన,టీడీపీ ఉమ్మడి ప్రభుత్వంలో అన్ని వసతులు కల్పించి ఘనంగా నిర్వహిస్తామని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి తెలిపారు. నగరంలోని పెన్నా తీరంలో బుధవారం జరిగిన ఏటి పండుగలో జనసేన నాయకులు పాల్గొని యువతకు గాలిపటాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జనసేన,టీడీపీ ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడటం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు, షస్త్రక్ అలియా, షేక్ కంతర్, అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



పెన్నానది తీరాన బుధవారం జరిగిన ఏటి పండుగలో కొలువుదీరిన దేవతామూర్తులు, భక్తుల సందడి

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

గ్రామాల్లో బెల్టు షాపులు అరికట్టాలి

తోటపల్లిగూడూరు, జనవరి 17 : మండలంలోని విచ్చలవిడిగా నిర్వహిస్తున్న బెల్టు షాపులపై సంబంధిత అధికారులు తూతూ మంత్రంగా దాడులు చేసి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. మండలంలో ఆరు ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉండగా సమీప గ్రామాలైన సాలిపేట, మండపం ఈదురు, చింతోపు, చిన్నచెరుకూరు, కోడూరు గ్రామాల్లో బెల్టు షాపుల నిర్వాహకులు అధిక ధరకు మద్యం విక్రయిస్తున్నారని, సంబంధిత అధికారులు స్పందించి గ్రామాల్లో బెల్టు షాపులను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం


మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం, జనవరి 17 : మండలంలోని నిడిగుంటపాళెం గ్రామంలో సిమెంట్ రోడ్లు, సైడు కాలువలు, సచివాలయ భవనం తదితర అభివృద్ధి పనులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో కట్టంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కనుపూరు కోదండరామిరెడ్డి, మందల వెంకటశేషయ్య, వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి, మోహన్‌నాయుడు కట్టంరెడ్డి రోహిత్ రెడ్డి తదితరులున్నారు.

22న శ్రీరాముడి శోభాయాత్ర

పొదలకూరు, జనవరి 17 : అయోధ్య రామమందిరం బాలరాముని విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా ఈనెల 22వ తేదీన పొదలకూరు పట్టణంలో శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మన్నెం శ్యామ్ తెలిపారు. శ్రీనివాసనగర్‌లో ఉన్న శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో 22వ తేదీ ఉదయం 9గంటలకు రామ్ నగర్ గేట్ సెంటర్ నుంచి రామమందిరం మీదుగా ప్రధాన రహదారిపై శోభాయాత్ర సాగి శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానం వద్దకు చేరుకుంటుందన్నారు. ఈ శోభాయాత్రలో రామభక్తులు, పట్టణ ప్రజలందరూ పాల్గొని స్వామివారి అక్షితలను, తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

గొబ్బెమ్మ ప్రతిష్ఠకు పుట్టమట్టి తరలింపు


పుట్టమట్టి తీసుకువస్తున్న గిరిజన మహిళలు

మనుబోలు, జనవరి 17: గొబ్బెమ్మ ప్రతిష్ఠ కోసం సాంప్రదాయ రీతిలో బుధవారం గిరిజన మహిళలు చెరువునుంచి పుట్టమట్టిని తీసుకెళ్ళారు. ఏటిపండుగ నాడు గొబ్బెమ్మ గ్రామోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు గొబ్బెమ్మను కొలువుంచి ప్రత్యేక పూజలు చేయనున్నట్లు స్థానిక చంద్రమౌళీనగర్ గిరిజన కాలనీ మహిళలు తెలిపారు.

పొన్నూరు రవీంద్రయ్యకు నివాళులు

మనుబోలు, జనవరి 17: మండలంలోని చెర్లోపల్లి గ్రామ టీడీపీ నాయకుడు పొన్నూరు అశోక్ పెదనాన్న పొన్నూరు రవీంద్రయ్య ఇటీవల మరణించారు. బుధవారం ఆయన ఉత్తరక్రియల్లో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన చిత్రపటం వద్ద నివాళులు అర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పొన్నూరు రామకృష్ణయ్య, రామకృష్ణారెడ్డి, కలికి వేణుగోపాల్ రెడ్డి, నరసయ్య, నాగేశ్వరరావు, మధునాయుడు,కలికి రమేష్ రెడ్డి, రాయపాటి కిరణ్‌కుమార్, చింతల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో జిల్లా జట్టుకు నేడు ఎంపికలు

కందుకూరు, జనవరి 17: నెల్లూరు జిల్లా సబ్‌జూనియర్ తైక్వాండో బాలబాలికల పోటీలు ఈనెల 18న స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంటు, మాస్టర్ ఎస్కే అబ్దుల్ సలాం, జిల్లా కార్యదర్శి పి.అఖిల్‌లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఉదయం 9 గంటలకు నేరుగా పోటీలకు హాజరుకావచ్చని, పతకాలు సాధించిన తైక్వాండో క్రీడాకారులు ఈనెల 20, 21 తేదీలలో నంద్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. వివరాలకు 9494946207ను సంప్రదించాలని కోరారు.

విద్యుత్ అక్రమ కనెక్షన్‌కు మహిళ బలి

● సంఘటనా స్థలాన్ని సందర్శించిన డీఎస్పీ రామచంద్ర


మృతి చెందిన కొండమ్మ

లింగసముద్రం, జనవరి 17 : అక్రమంగా విద్యుత్ వాడుతూ, విద్యుత్ సరఫరా ఉన్న ఓ కేబుల్‌ను నిర్లక్ష్యంగా పడేయడంతో, దానిని పక్కకు తీసే క్రమంలో ఓ మహిళ విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని మొగిలిచెర్ల ఆదిఆంధ్ర కాలనీ ఎదురుగా ఉన్న పొలాల్లో బుధవారం జరిగింది. ఆ కాలనీకి చెందిన యనదాసరి కొండమ్మ (55) మృతి చెందింది.కందుకూరు డీఎస్పీ ఏ రామచంద్ర సమాచాం మేరకు.. అదే గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు తమ పొగాకు పైరుకు సాగునీటి కోసం ఆదిఆంధ్ర కాలనీ ఎదురుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అక్రమంగా కేబుల్ తగిలించి, వారి బావి వద్ద ఉన్న విద్యుత్ మోటారుకు కనెక్షన్ ఇచి నీరు పారించుకున్నారు. అయితే నీరు పారించుకున్న తరువాత మోటారు నుంచి కేబుల్‌ను తీసి పక్కన ఉన్న కొండమ్మ పొలంలో వేసి, ట్రాన్స్‌ఫార్మర్‌లో నుంచి కేబుల్ కనెక్షన్ తీయకుండా వెళ్లిపోయారు. అయితే కొద్దిసేపటి తరువాత కొండమ్మ తన పొలంలో వేసిన జొన్నమేత పైరుకు మందు చల్లేందుకు వచ్చి చేలో ఉన్న కేబుల్‌ను పక్కకు తీయబోగా, కేబుల్‌కు ఉన్న కొక్కెం మెడకు తగిలి విద్యుదాఘాతానికి గురై పెద్దగా కేకలు వేసింది. అయితే ఆమె కుమారుడు చిన్న, కుమార్తె లుధియాలు ఆమెను కాపాడబోగా కరెంటు షాక్ తగిలింది. అయితే అక్కడే ఉన్న కొందరు కేబుల్‌ను తప్పించారు. అప్పటికే కొండమ్మ మృతి చెందింది. ఈ సంఘటనతో కొండమ్మ కుమారులు, కుమార్తె కన్నీరు మున్నీరుగా విలపించారు. కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు ఆ ఇద్దరు రైతులపై కొండమ్మ కుమార్తె కంచుపాటి లుధియా పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో సాయంత్రం కందుకూరు డీఎస్పీ ఏ రామచంద్ర, ఇన్‌చార్జ్ సబ్ ఇన్‌స్పెక్టర్ మహేంద్రనాయక్‌లు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. సంఘటనకు గల కారణాలను పరిశీలించి, కొండమ్మ బంధువులు, స్థానికుల నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. అనంతరం కొండమ్మ మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై ఎస్సీ ఎస్టీ కేసు కూడా నమోదు చేసినట్లు డీఎస్పీ రామచంద్ర చెప్పారు.

విజేతలకు బహుమతుల ప్రదానం


బహుమతి అందజేస్తున్న ట్రైనీ డీఎస్పీ హేమలత

కోవూరు, జనవరి 17: సంక్రాంతి పర్వదినం సందర్భంగా పట్టణంలోని కోనేటికయ్యలు ప్రాంతంలో సోమ, మంగళవారాల్లో నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బుధవారం ట్రైనీ డీఎస్పీ హేమలత బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్రాంతి సంప్రదాయం చాలా గొప్పదన్నారు. మహిళలు రంగవల్లుల పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. దిలైట్ హార్ట్ ఫౌండేషన్, పెద్ది ప్రభావతి చారిటబుల్ ట్రస్టు రంగవల్లులు, స్లో సైక్లింగ్ పోటీలు నిర్వహించింది. బహుమతి ప్రదానోత్సవం కార్యక్రమంలో స్థానిక నాయకులు అత్తిపల్లి అనూప్‌రెడ్డి, మదన్‌రెడ్డి, దిలైట్ హార్ట్ ఫౌండేషన్ ప్రతినిధులు తన్మయ్, భరత్, చక్రి, శ్యామ్, వేణు, తేజ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఆదాలపై దుష్ప్రచారం

● నెల్లూరు ఏఎంసీ చైర్మన్ పేర్నేటి

నెల్లూరు(వ్యవసాయం), జనవరి 17 : నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి టీడీపీ నేత లోకేష్‌ను కలిశారంటూ కొంత మంది దుష్ప్రచారం చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని నెల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) చైర్మన్ పేర్నేటి కోటేశ్వరరెడ్డి అన్నారు. నెల్లూరులోని ఆయన కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. వైసీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై దృష్టి సారించారని చెప్పారు. దాదాపు రూ160కోట్లతో ఇప్పటి వరకు అభివృద్ధి పనులు చేశారన్నారు. ఈ నేపథ్యంలో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, ఇవి మానుకోలేదంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఎంసీ సభ్యులు వెంకటేశ్వర్లు, స్వర్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రా.. కదలిరా బహిరంగ సభ విజయవంతం చేయాలి

● సర్వేపల్లి జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి


మాట్లాడుతున్నజనసేన నేత బొబ్బేపల్లి

వెంకటాచలం, జనవరి 17 : వెంకటగిరిలో ఈనెల 19వ తేదీన టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జరిగే రా.. కదిలిరా భారీ బహిరంగ సభకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేయాలని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని సర్వేపల్లిలో ఉన్న ఆపార్టీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీలు కలిసి ప్రజా ప్రభుత్వం స్థాపించడం ఖాయమన్నారు. రాష్ట్రాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాలుగా దోచుకున్నారని విమర్శించారు. రాష్ట్రాన్ని కాపాడుకోవాలంటే టీడీపీ, జనసేలకు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పినిశెట్టి మల్లికార్జున్, షేక్ రహీమ్, శ్రీహరి తదితరులున్నారు.

నేడు జయహో బీసీ సదస్సు

ఇందుకూరుపేట, జనవరి 17 : ఇందుకూరుపేటలో ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం జయహో బీసీ సదస్సు నిర్వహిస్తున్నట్లు మండల టీడీపీ కన్వీనర్ రావెళ్ల వీరేంద్రచౌదరి తెలిపారు. ఈ సదస్సులో కోవూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బీసీ నాయకులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

వచ్చేనెలలో కళాజాతాలు

● జేవీవీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కాలేషాబాషా


సీడీలను ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

నెల్లూరు(వైద్యం), జనవరి 17 : ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు వచ్చే నెల మొద టి వారంలో కళా జా తాలు నిర్వహిస్తున్న ట్లు జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) రాష్ట్ర కార్యద ర్శి డాక్టర్ కాలేషాబా షా తెలిపారు. నగరం లోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో బుధవారం జేవీవీ విజ్ఞాన గీతాల సీడీ ఆవిష్కరణ జరిగింది. జేవీవీ సాంస్కృతిక విభాగం జిల్లా కన్వీనర్ విజయ కుమార్ అధ్యక్షత వహించారు. కళాకారులు పార్వతీశం, సుబ్రహ్మణ్యం, గోపీనాథ్ గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో ఉదయభాస్కర్, కృష్ణారెడ్డి, యూటీఎఫ్ నేత చలపతి శర్మ, ప్రజానాట్యమండలి శేషయ్య, సాహితీ స్రవంతి గోపి, పీపీసీ వైద్యు లు శ్రీనునాయక్, రఫీ, బుజ్జయ్య, విద్యాచరణ్, విజయమ్మ పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ మృతి

ఇందుకూరుపేట, జనవరి 17 : ఇందుకూరుపేట పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న 1993 బ్యాచ్‌కి చెందిన పీ.శ్రీనివాసులు గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హస్పిటల్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల ఎస్ఐ వీరేంద్రబాబు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

కేంద్ర పథకాలు తెలిపేందుకే 'వికసిత్ భారత్'

● బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్రరెడ్డి



మాట్లాడుతున్న సురేంద్రరెడ్డి


నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జనవరి 17: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు తెలియజేయ డానికే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర చేప డుతున్నామని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ సురేంద్రరెడ్డి తెలి పారు. నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో బుధవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జరిగింది. ఆయన మాట్లాడుతూ ఉజ్వల యోజన, పీఎం స్వనిధి, పీఎం సురక్ష బీమా, ఆయుష్మాన్ భారత్ వంటి అనేక సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తోందని చెప్పారు. అర్హులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆంజనేయులురెడ్డి, రాజేశ్వరమ్మ, శ్రీనివాసులు, ముక్కు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లేబూరులో 'జగనన్న సురక్ష'

ఇందుకూరుపేట, జనవరి 17 : జగదేవిపేట పీహెచ్‌సీ పరిధిలో లేబూరు బిట్-1లో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కంటి సంబంధిత వైద్య పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు అందజేశారు. హెల్త్ ఎడ్యుకేటర్ సీహెచ్ సుధాకర్‌రావు, నాయకులు వీ.బాబయ్య, సీహెచ్ఓ సారిక, హెల్త్ అసిస్టెంట్ ఖాదర్‌బాషా, సుశీలమ్మ పాల్గొన్నారు.

ఎన్నికల సంబంధ విధుల్లో అధికార యంత్రాంగం తీరుతో జిల్లా ప్రతిష్ట మసకబారుతోంది. రాష్ట్రంలో అనేక జిల్లాలుండగా ఎక్కడా లేని విధంగా ఇక్కడి యంత్రాంగమే ఎన్నికల అధికారుల ఆగ్రహానికి గురవుతోంది. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో విఫలమయ్యారన్న ఫిర్యాదులతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఏకంగా అప్పటి కలెక్టర్, అర్బన్ ఎస్పీ, ఇద్దరు డీఎస్పీలు, ఓ సీఐని బదిలీ చేయాల్సిందిగా ఆదేశించిన సంగతి తెలిసిందే. ఇపుడు సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితా తయారీలో అవకతవకలు జరుగుతున్నాయనే ఫిర్యాదులతో కేంద్ర ఎన్నికల సంఘం జిల్లా అధికారులపై మండిపడుతోంది. మొత్తం మీద రాష్ట్ర, కేంద్ర ఎన్నికల సంఘాల హెచ్చరికలు, చర్యలతో గతంలో ఉమ్మడి జిల్లా, ప్రస్తుతం కొత్త జిల్లా తలవంపులకు లోనవుతున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



మచ్చ పడుతోంది సారూ!

ఓటర్ల జాబితా తయారీలో అక్రమాలపై సీఈసీ కన్నెర్ర

ఈ ఏడాది మార్చి లేదా ఏప్రిల్‌లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి గతేడాది జూన్ నుంచీ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఆ ప్రక్రియలో ప్రత్యేకించి చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి, వెంకటగిరి తదితర నియోజకవర్గాల్లో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని గత జూన్ నుంచీనే ప్రతిపక్షాల నుంచీ పెద్దఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయి. ఎప్పటికప్పుడు ముఖ్యంగా టీడీపీ గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి నాయకులు బీఎల్వోలు మొదలుకుని తహసిల్దార్లు, ఆర్డీవోలు, కలెక్టర్ దాకా ఫిర్యాదులు చేస్తూనే వున్నారు. అయితే వాటిపై అధికారులు సక్రమంగా విచారించి చర్యలు తీసుకోలేదు. చంద్రగిరిలో అయితే టీడీపీ ఓట్లు తొలగించాలని కోరుతూ ఆ పార్టీ వారి పేరిటే తప్పుడు క్లెయిమ్ ఫారాలు అందజేయడం వంటి అవకతవకలు చోటుచేసుకున్నాయి. భార్య, బిడ్డల ఓట్లు తొలగించాలని ఆ ఇంటి యజమాని పేరిటే దరఖాస్తు అందడం వంటి ఘటనలను టీడీపీ నేతలు వందల్లో గుర్తించారు. వలస వెళ్లిన వారి పేర్లు తొలగించకపోవడం, మృతి చెందిన వారి పేర్లు తొలగించకపోవడం, ఇతర ప్రాంతాలకు చెందిన వారి పేర్లు జాబితాలో నమోదు చేయడం వంటివి జరిగినట్టు గుర్తించారు. వాటిని ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదు. దీంతో టీడీపీ నాయకులు నేరుగా ఎన్నికల సంఘానికే ఫిర్యాదు చేశారు.

గత నెలలో విజయవాడలో కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు జిల్లాల వారీగా సమీక్షించినపుడు కూడా తిరుపతి జిల్లా అధికారులే ఎక్కువగా ప్రశ్నలను, హెచ్చరికలను ఎదుర్కొనాల్సి వచ్చింది. అభ్యంతరాలపై బీఎల్వోలు సక్రమంగా విచారణ జరపలేదని గుర్తించిన ఎన్నికల సంఘం అధికారులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో తిరుపతి రూరల్ మండలంలోనే 24మంది బీఎల్వోలకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. జనవరిలో మళ్లీ సమీక్షిస్తామని, అప్పటికి సమస్యలేవీ లేకుండా చర్యలు తీసుకోవాలని గత డిసెంబరు సమావేశాల్లోనే ఎన్నికల సంఘం జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దానికనుగుణంగా ఈనెల 9వ తేదీన విజయవాడలో జిల్లాల వారీగా కేంద్ర ఎన్నికల కమిషనర్లు సమీక్ష జరిపారు. మిగిలిన జిల్లాల సమీక్ష నామమాత్రంగా ఐదు పది నిమిషాల లోపే జరగగా తిరుపతి జిల్లాపై సమీక్ష గంటకు పైగా నడిచిందని సమాచారం. చాలా లోతైన సమాచారంతో సమీక్షించిన ఎన్నికల కమిషనర్లు జిల్లా అధికార యంత్రాంగం తీరుపట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా గత నవంబరులో విడుదల చేసిన డ్రాఫ్ట్ జాబితా పరిశీలించి వాటిపై ప్రతిపక్ష నాయకులు అభ్యంతరాలు తెలిపినప్పటికీ తొలగించాల్సిన పేర్లు ఇప్పటికీ జాబితాలో కొనసాగుతుండడం పట్ల ఎన్నికల కమిషనర్లు తీవ్రంగా స్పందించారు. ఓటర్ల జాబితాకు సంబంధించి ఓటర్లు, రాజకీయ పక్షాల నుంచీ అందిన అభ్యంతరాలపై గడువులోపు పూర్తిస్థాయిలో విచారణ జరిపి అక్రమాలుంటే వాటిని సరిదిద్దాలని డెడ్‌లైన్ విధించింది.

ఎన్నికల్లో అధికారుల తీరుతో మసకబారుతున్న జిల్లా ప్రతిష్ట

గతంలో కలెక్టర్, ఎస్పీ, ఇద్దరు డీఎస్పీలు, ఓ సీఐలపై బదిలీ వేటు

ఇటీవల జిల్లా అధికారులపై ఎన్నికల కమిషన్ తీవ్ర ఆగ్రహం

రాజకీయ ఒత్తిళ్ళకు తలొగ్గి స్వతంత్రంగా వ్యవహరించలేని తీరుకు పర్యవసానం

ఎంపీ ఉప ఎన్నికల తప్పిదాలపైనా ప్రస్తావన

విజయవాడలో జిల్లా అధికారులతో ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం సమీక్షించిన సందర్భంలో 2021 మార్చిలో జరిగిన తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల తప్పిదాలను ప్రధానంగా ప్రస్తావించినట్టు తెలిసింది. అప్పటి తిరుపతి మున్సిపల్ అధికారుల కారణంగా అధికార పార్టీ నాయకులు ఏకంగా డూప్లికేట్ ఓటరు కార్డులను యధేచ్ఛగా తయారు చేసి దొంగ ఓట్లు వేయించారన్న విషయాన్ని ప్రస్తావించినట్టు సమాచారం. ఓ అధికారి తన లాగిన్ ఐడీని అధికార పార్టీలో ముఖ్యనేతకు అందజేయడంతో ఆ నేత పూర్తిస్థాయిలో దుర్వినియోగం చేసినట్టు గుర్తించామని ఎన్నికల సంఘం అధికారులు ప్రస్తావించినట్టు తెలిసింది. గత పార్లమెంటు ఉప ఎన్నికలకు సంబంధించి, అలాగే ఇపుడు ఓటర్ల జాబితా తయారీకి సంబంధించి జిల్లా యంత్రాంగం కేంద్ర ఎన్నికల సంఘం నుంచీ తీవ్ర ఆగ్రహాన్ని, అసంతృప్తిని ఎదుర్కొనాల్సి వచ్చింది.

గతంలో కలెక్టర్, ఎస్పీ సహా ఇతర అధికారులపై బదిలీ వేటు

ఉమ్మడి జిల్లాకు సంబంధించి 2020 మార్చిలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో బాధ్యతారహితంగా వ్యవహరించారన్న ఆరోపణలతో అప్పటి కలెక్టర్ నారాయణ భరత్ గుప్తా, తిరుపతి అర్బన్ ఎస్పీ ఆవుల రమేష్‌రెడ్డి, పలమనేరు డీఎస్పీ ఆరిఫుల్లా, శ్రీకాళహస్తి డీఎస్పీ నాగేంద్రుడు, పుంగనూరు సీఐ గంగిరెడ్డిలను విధుల నుంచీ తొలగించాల్సిందిగా స్టేట్ ఎలక్షన్ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ఆదేశించిన సంగతి తెలిసిందే. అయితే కొవిడ్ సంక్షోభం కారణంగా అప్పట్లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ వాయిదా పడింది. తర్వాత 2021 జనవరిలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభించేందుకు కసరత్తు మొదలుపెట్టగా ఎస్ఈసీ రమేష్‌కుమార్ మరోసారి ఈ అధికారులను బదిలీ చేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. కానీ ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో ఈ ఆదేశాలు అమలు కాలేదు. కానీ ఎస్ఈసీ ఆదేశాల ప్రభావం జిల్లా యంత్రాంగంపై తీవ్ర ప్రభావం చూపి జిల్లా అధికారి నుంచీ ఉద్యోగి వరకూ భయభ్రాంతులకు గురి చేసింది. దీనికి మించి జిల్లా పరువు ప్రతిష్టలు దారుణంగా దెబ్బతిన్నాయి. ఇపుడు తిరుపతి జిల్లా యంత్రాంగం పని తీరు కేంద్ర ఎన్నికల సంఘం ఆగ్రహానికి, అసంతృప్తికి, హెచ్చరికలకు కారణమై మరోసారి జిల్లా పరువు ప్రతిష్టలు మసకబారే పరిస్థితి నెలకొంది.



స్వర్ణముఖిలో గొబ్బెమ్మల నిమజ్జనం

స్వర్ణముఖి పులకింత



ఏటిపండుగలో జనసందోహం

నాయుడుపేట, జనవరి 17: స్వర్ణముఖి నది జన సంద్రమైంది. సంక్రాంతి సంబరాల్లో భాగంగా యేడాది పండుగ రెండో రోజు బుధవారం ఏటి పండుగకు జనం భారీగా తరలివచ్చారు.గొబ్బెమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన మహిళలు నదిలో నిమజ్జనం చేశారు.టీవీ నటుల హాస్యవల్లరి కార్యక్రమం అలరించింది. రంగురంగుల బెలూన్లు, రంగులరాట్నాలు, జెయింట్‌వీల్, నెమలి పడవ, బెలూన్ జారుడుబల్ల తదితరాలు చిన్నారులను ఎంతగానో ఆకట్టుకొన్నాయి. గాలిపటాలను ఎగురవేస్తూ ,కబడ్డీ, రింగ్‌బాల్, ఖోఖో ఆటలతో యువకులు ఆనందించారు.



కొండచుట్టు మండపం వద్ద జనసందడి

వేడుకగా కొండచుట్టు

పుత్తూరు జనవరి 17: సంక్రాంతి సంబరాల్లో భాగంగా కొండచుట్టు మండప ఉత్సవం బుధవారం పుత్తూరులో వైభవంగా జరిగింది.పట్టణంలోని చిత్తూరు రోడ్డులో కొత్తగా నిర్మించిన కొండచుట్టు మండపానికి ఊరేగింపుగా చేరుకున్న ఎనిమిది ఆలయాల దేవుళ్లను ప్రజలతో పాటు మంత్రి రోజా దర్శించుకున్నారు.పదేళ్ల కిందట జాతీయ రహదారి విస్తరణలో భాగంగా తొలగించిన మండపం స్థానంలో పునర్నిర్మించిన కొత్త మండపంలో తొలిసారి ఎనిమిది దేవుళ్ల ఈసారి కొలువు కావడం విశేషం.ఈ ఉత్సవం వల్ల చిత్తూరు- పుత్తూరు జాతీయ రహదారిలో ట్రాఫిక్ స్తంభించడంతో నెత్తం మీదుగా నగరి రోడ్డులోకి వాహనాలను మళ్లించారు. మున్సిపల్ ఛైర్మన్ హరి , వైస్‌ఛైర్మన్లు జయప్రకాష్, సదాశివేశ్వరస్వామి ఆలయ ఛైర్మన్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.





ఎల్లమ్మ ఊరేగింపులో జనసందోహం

ఎల్లమ్మ కొండచుట్టు తిరుణాళ్ళు

చంద్రగిరి, జనవరి 17 : చంద్రగిరిలోని మూలస్థాన ఎల్లమ్మ సంక్రాంతి మహోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి కొండచుట్టు తిరుణాళ్ళు వైభవంగా జరిగాయి. మధ్యాహ్నం 2 గంటలకు అమ్మవారి ఉత్సవమూర్తిని ఆలయ ముఖ మండపానికి తీసుకొచ్చి పట్టు పీతాంబరాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి అశ్వవాహనంపై అధిష్ఠింపజేశారు.చంద్రగిరిలోని మిట్టమీద గంగమ్మ, కోటలోని ముత్యాలమ్మ, చంద్రగిరి కొత్తపేటలోని అంకాలమ్మ, రాయలపురం గ్రామంలోని మాతమ్మ ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ఎల్లమ్మతో పాటు మేళతాళాలు, కీలుగుర్రాలు, కోలాటాలు, చెక్కభజనలు, పిళ్ళంగట్లు నడుమ చంద్రగిరిలో ఊరేగించారు. టీటీడీ తరఫున ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పట్టు వస్త్రాలను కోదండరామాలయం నుంచి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ తీసుకొచ్చి ఎల్లమ్మకు సమర్పించారు.ఎల్లమ్మ బుధవారం రాత్రి అగరాల, కుప్పిరెడ్డిగారిపల్లె, పుల్లయ్యగారిపల్లె, పాండురంగయ్యగారిపల్లె, ఐతేపల్లె, కొటాల, నాగయ్యగారిపల్లె, రెడ్డివారిపల్లెల మీదుగా ఊరేగి గురువారం తెల్లవారుజామున ఆలయానికి చేరుకుంది. ఆలయ ఛైర్మన్ చంద్రశేఖర రెడ్డి, ఈవో తిమ్మారెడ్డి, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.



కారులో ఇరుక్కుపోయిన సీఐ అక్కేశ్వరరావు

కారు,బస్సు ఢీ

మార్టూరు సీఐకి తీవ్రగాయాలు

పెళ్లకూరు, జనవరి 17:బాపట్ల జిల్లా మార్టూరు సీఐ అక్కేశ్వరరావు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు... అనంతపురం జిల్లా లేపాక్షిలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ కార్యక్రమ బందోబస్తుకు వెళ్లి తిరిగి వస్తున్న సీఐ అక్కేశ్వరరావు కారు, ఓ ప్రైవేట్ బస్సు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటన పెళ్లకూరు మండలంలోని గుర్రప్పతోట 71వ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున జరిగింది. ఈ ప్రమాదంలో సీఐ అక్కేశ్వరరావుకు తీవ్ర గాయాలు కాగా, కారు డ్రైవర్ సర్దార్‌కు స్వల్ప గాయాలయ్యాయి.కారు నుంచి మంటలు చెలరేగిన సమాచారం అందుకున్న ఎస్ఐ శ్రీకాంత్‌తో పాటు అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. సీఐ అక్కేశ్వరరావును, డ్రైవర్ సర్దార్‌ను అతి కష్టం మీద కారులో నుంచి బయటకు తీసి 108 వాహనంలో నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఎదురెదురుగా ఢీకొన్న బస్సు, కారు

రా....కదలిరా

వెంకటగిరిలో రేపు టీడీపీ బహిరంగ సభ

ఏర్పాట్లను పరిశీలించిన పార్టీ నాయకులు



→ చంద్రబాబు సభ నిర్వహించే ప్రాంతంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

వెంకటగిరి, జనవరి 17: వెంకటగిరి పట్టణంలోని తిరుపతి రోడ్డు మార్గంలో తెలుగు దేశం పార్టీ రా కదలిరా పేరిట 19వతేది నిర్వహిస్తున్న బహిరంగ సభ ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. సభా ప్రాంగణంలో స్టేజ్ ఏర్పాటు చేసే ప్రదేశంలో వేదపండితులచే భూమిపూజా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు హాజరయ్యే ఈ సభ ఏర్పాట్లను బుధవారం తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు నరసింహయాదవ్, వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తదితరులు పరిశీలించారు. ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్సీ రామ్‌గోపాల్ రెడ్డి చంద్రబాబు రూట్ మ్యాప్‌ను నాయకులకు వివరించారు.టీడీపీ నాయకులు మస్తాన్‌యాదవ్, పులికొల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, జన్ని రమణయ్య, మధు నాయుడు, సీసీ నాయుడు, శాంతారావు, కాపా శ్రీనివాసుల నాయుడు, కొరపాటి రామచంద్రానాయుడు, సుధ తదితరులు పాల్గొన్నారు.

దొంగే దొంగా..దొంగా అని అరిచినట్లుంది

చంద్రబాబుపై వైసీపీ సర్కారు పెట్టిన కుట్రపూరిత కేసులు దొంగే దొంగా.. దొంగా అని అరిచిన చందంగా ఉందని నరసింహయాదవ్ ఆక్షేపించారు.రా కదలిరా బహిరంగ సభా ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కోర్టు తీర్పులను సైతం జగన్ పత్రికలో వక్రీకరించి రాయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.తెలుగుదేశం, జనసేన నాయకులు చిన్న ట్వీట్ పెడితేనే పెద్ద కేసులు కట్టే ప్రభుత్వం జగన్ పత్రిక తప్పుడు రాతలు రాస్తుంటే చూస్తూ ఊరుకోవడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రజలు జగన్మోహన్ రెడ్డిని ఇంటికి సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారని ఇందుకు చంద్రబాబు నిర్వహించే సభలకు అంచనాలకు మించి జనం హాజరు కావడమే నిదర్శనమన్నారు. కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ చంద్రబాబుపై ఎన్నితప్పుడు కేసులు పెట్టినా కడిగిన ముత్యంలా ఆయన బయటకు వస్తారన్నారు.

జల్లికట్టు వేడుకల్లో విషాదం

ఎద్దు పొడవడంతో తిరుపతివాసి మృతి

చంద్రగిరి, జనవరి 17: చంద్రగిరి మండలంలో బుధవారం నిర్వహించిన జల్లికట్టు వేడుకల్లో అపశ్రుతి చోటుచేసుకుంది.మల్లయ్యపల్లె, దోర్నకంబాల, మండపంపల్లెల్లో నిర్వహించిన జల్లికట్టు సంబరాలతో మూడు గ్రామాలూ తిరుణాళ్ళను తలపించాయి. కోడెగిత్తలను నిలువరించి చెక్కపలకలను సొంతం చేసుకొనేందుకు యువత పోటీ పడ్డారు.ఈ ప్రయత్నంలో కొంతమంది గాయపడ్డారు.అనుప్పల్లి-చంద్రగిరి రోడ్డు మార్గంలో వాహనాల రాకపోకలు పెరిగిపోవడంతో కొంతసేపు ట్రాఫిక్ స్తంభించిపోయింది. మల్లయ్యపల్లె సమీపంలోని ధనేశ్వరమ్మ ఆలయం వద్ద బుధవారం మధ్యాహ్నం తిరుపతికి చెందిన గురుప్రసాద్ రోడ్డు దాటుతుండగా ఓ ఎద్దు పొడవడంతో అపస్మారస్థితికి చేరుకున్నాడు. 108అంబులెన్సులో తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు.





దోర్నకంబాల జల్లికట్టులో యువత ఉత్సాహం - ఎద్దు పొడవడంతో గాయపడ్డ గురుప్రసాద్

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

చంద్రబాబు సభను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

కోట, జనవరి 17: వెంకటగిరిలో ఈ నెల 19వ తేదీన జరిగే చంద్రబాబు బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ కోరారు. కోటలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం రాత్రి కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం జరిగింది. సునీల్‌కుమార్‌తో పాటు మాతంగి కృష్ణ, పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్‌లు పాల్గొని కార్యకర్తలు, నాయకులతో సమీక్షించారు. ప్రతి మండలం నుంచి గ్రామాల వారీగా ప్రజలు వెంకటగిరికి చేరుకునేలా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో కోట, చిట్టమూరు మండలాల టీడీపీ అధ్యక్షులు మద్దాలి సర్వోత్తమరెడ్డి, గణపర్తి కిషోర్‌నాయుడు, వాకాడు మండల ప్రధాన కార్యదర్శి దోశకాయల కృష్ణమూర్తి, నేతలు జలీల్ అహ్మద్, తీగల సురేష్‌బాబు, మధుయాదవ్, ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.

రాముడి విగ్రహ ప్రతిష్ఠను పండుగలా జరుపుకోవాలి: కేంద్రమంత్రి



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి దేవసింగ్ చౌహాన్

కోట, జనవరి 17: అయోధ్యలో ఈ నెల 22వ తేదీన రామమందిరంలో జరగనున్న శ్రీరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠను ప్రతి హిందువూ పండుగలా జరుపుకోవాలని కేంద్ర మంత్రి దేవసింగ్ చౌహాన్ కోరారు. కోట మండలం జరుగుమల్లిలో బుధవారం జరిగిన వికసిత్ భారత్ సంకల్పయాత్రలో కేంద్ర మంత్రి పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి పురుషోత్తంరెడ్డి, జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప, ఉపాధ్యక్షుడు భైరప్ప, పనబాక కోటేశ్వరరావు, సారంగం రమేష్‌బాబు, ఉచ్చూరు రవీంద్రరెడ్డి, కోటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముట్టెంబాకలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర

వాకాడు, జనవరి 17: మండలంలోని ముట్టెంబాక గ్రామంలో బుధవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కేంద్రమంత్రి దేవసింగ్ చౌహాన్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన ప్రజా సంక్షేమ పథకాలు గ్రామగ్రామాన తెలిసేలా వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బియ్యం, గ్యాస్ కనెక్షన్ వంటి పథకాలు, హెల్త్‌కార్డు, మాతృవందన తదితర పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు, గూడూరు నియోజకవర్గ కన్వీనర్ పాపారెడ్డి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు కళావల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఉంటా: నేదురుమల్లి



కార్మికులతో మాట్లాడుతున్న రాంకుమార్ రెడ్డి

వెంకటగిరి టౌన్, జనవరి 17: మున్సిపల్ కార్మికులకు అండగా ఉంటానని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి అన్నారు. గత 17 రోజులుగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెను బుధవారం విరమింపజేశారు. ఈ సందర్భంగా రాంకుమార్ రెడ్డి మాట్లాడుతూ వారం రోజుల్లో కార్మికుల జీతాలు వారి ఖాతాల్లో జమ అవుతాయని హామీ ఇచ్చారు. కార్మికులు మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ వ్యవహారశైలితో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గత ఐదు నెలలుగా ఆప్కాస్ కార్మికుడిని ఇబ్బందులకు గురిచేశారని, జీతం ఇవ్వకుండా నిలిపేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

8వ వార్డులో గడపగడపకు...

వెంకటగిరి టౌన్, జనవరి 17: పట్టణంలోని 8వ వార్డులో వైసీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు. మండల పరిధిలోని వైసీపీ సీనియర్ నాయకులు బత్తినపట్ల వీరారెడ్డి ఆకస్మికంగా మరణించడంతో ఆయన పార్థివదేహానికి నివాళులు అర్పించి, కుటుంబానికి మనోధైర్యం చెప్పారు.

ఖాతాదారులకు మరిన్ని సేవలు



ఏటీఎంను ప్రారంభిస్తున్న యూనియన్ బ్యాంక్ ఆర్ఎం జోగారావు

నాయుడుపేట, జనవరి 17: యూనియన్ బ్యాంక్ సేవలను ఖాతాదారులకు మరింత చేరువ చేసేందుకు ఏటీఎంలను ఏర్పాటు చేస్తున్నట్లు రీజనల్ మేనేజర్ జోగారావు అన్నారు. నాయుడుపేట దర్గావీధిలోని యూనియన్ బ్యాంక్ వద్ద బుధవారం ఏటిఎంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ వాణిజ్య, వ్యవసాయ, గృహ, వాహన, విద్య రుణాలను విస్తృతంగా అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే సీనియర్ సిటిజన్ డిపాజిట్‌లకు ఎక్కువ వడ్డీని అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ బీఎం రంజిత్, మాజీ సర్పంచు, ప్రముఖ వ్యాపారవేత్త గాలి రమేష్ నాయుడు, మెంటా రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి

కోట, జనవరి 17: కోట మండలం కొత్తపట్నం పంచాయతీలోని వావిళ్ల దొరువు దళితవాడకు చెందిన ఇంగిలాల వెంకటరమణయ్య(55) చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందినట్లు ఎస్ఐ నాగబాబు తెలిపారు. వావిళ్ల దొరువు దళితవాడకు చెందిన వెంకటరమణయ్య గ్రామానికి సమీపంలో ఉన్న ఉప్పునీటి కాలువలో చేపలు పట్టేందుకు మంగళవారం వెళ్లాడు. చేపలు పడుతూ ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. వెంకటరమణయ్య ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల విచారించిన ఆచూకీ లభించలేదు. పశువుల కాపర్లు కాలువ ఒడ్డున వెంకటరమణయ్య మృతదేహాన్ని గమనించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. కుటుంబసభ్యులు వెళ్లి మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చారు. కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ నాగబాబు తెలిపారు.

23న వెంకటగిరి మండల మీట్

వెంకటగిరి టౌన్, జనవరి 17: వెంకటగిరి మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ తంబిరెడ్డి తనూజా అధ్యక్షతన ఈ నెల 23వ తేదీన నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో విజయలక్ష్మి బుధవారం తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీ, అధికారులు హాజరుకావాలని కోరారు.

దుమ్ము లేస్తోంది..!

- అధ్వానంగా వరగలి క్రాస్ - తమ్మినపట్నం రోడ్డు
- నిత్యం భారీ వాహనాల రాకపోకలు
- దారి పక్కన ఇళ్లలోకి చేరుతున్న దుమ్ము
- అవస్థలు పడుతున్న వాహనదారులు, స్థానికులు



వాహనాల రాకపోకలతో రోడ్డుపై దుమ్ము

చిల్లకూరు, జనవరి 17: చిల్లకూరు మండలంలోని వరగలి క్రాస్ - తమ్మినపట్నం ప్రధాన రహదారి గుంతలు ఏర్పడి అధ్వానంగా ఉంది. తీర ప్రాంతంలోని పలు పరిశ్రమలకు రాకపోకలు సాగించే భారీ వాహనాలతో పాటు అధిక లోడుతో సిలికా రవాణా చేసే వాహనాల వల్ల రోడ్డు బాగా దెబ్బతింది. సుమారుగా 20 కిలోమీటర్ల దూరం ఉన్న ఈ దారిలో భారీ వాహనాల రాకపోకలతో దుమ్ము లేస్తోంది. దీంతో దారిపక్కన నివాసం ఉండేవారితో పాటు వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా పారిచెర్లవారిపాళెం, చేడిమాల, తిక్కవరం, కలవకొండ, రామారెడ్డిపాళెం, చింతవరం, ఏరూరు తదితర గ్రామాల ప్రజలు వాహనాల రాకపోకలతో లేస్తున్న దుమ్ముతో ఇబ్బందులు పడుతున్నారు. అసలే భారీ గుంతలు ఏర్పడి రోడ్డు అధ్వానంగా ఉంది. ఈ రోడ్డుపై రాకపోకలు సాగించాలంటే వాహనదారులతో పాటు ఆటోలు, బస్సుల్లో వెళ్లే ప్రయాణికులు నకయాతనపడుతున్నారు. ఇటీవల కలవకొండ గ్రామస్తులు తమ ఇళ్లలోకి దుమ్ము చేరుతోందని వాహనాలను అడ్డుకుని నిరసన తెలిపారు. దీంతో రెండు రోజులు రోడ్డుపై దుమ్ములేవకుండా నీళ్ల పడుతున్నారు. అయితే అధికంగా నీళ్ల పడుతుండడంతో రోడ్డు బురదమయంగా మారుతోందని వాహనాదారులు అంటున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టి దుమ్ము లేవకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.





కోటలో షోకాజ్ నోటీసులకు జవాబు పత్రాలతో నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు - వెంకటగిరిలో దీక్ష

అంగన్వాడీలపై కక్ష సాధింపు మానుకోవాలి

సూళ్లూరుపేట, జనవరి 17: న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని అంగన్వాడీలు పండుగ దినాల్లో సైతం ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం న్యాయం చేయకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం అన్యామని యూనియన్ నాయకురాలు హైమావతి అన్నారు. బుధవారం స్థానిక హోలీక్రాస్ సెంటర్ వద్ద శిబిరంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ షోకాజ్‌లు అందజేసి బెదిరిస్తే భయపడేది లేదని, తమ డిమాండ్లను అంగీకరించకుంటే విధులకు హాజరుకాబోమని తేల్చి చెప్పారు. మహిళలు నెల రోజుల పైబడి రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నా ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చలేని స్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందని సీఐటీయూ నాయకుడు పద్మనాభయ్య అన్నారు. అనంతరం ఆందోళన శిబిరం నుంచి సీడీపీవో ప్రాజెక్టు కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్లి షోకాజ్ నోటీసులకు సమాధానం రాసి సీడీపీవో శారదాంబకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

గూడూరు: అంగన్వాడీల న్యాయమైన సమస్యలను రాష్ట్రప్రభుత్వం పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగిస్తామని సీఐటీయూ నాయకులు అన్నారు. బుధవారం స్థానిక గ్రామసేవకుల భవనం వద్ద అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 37వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సీఎం జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సమ్మె చేస్తుంటే రాష్ట్రప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అంగన్వాడీలను బెదిరింపులకు గురిచేసేందుకు ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం మంచిపద్ధతి కాదన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శివకుమార్, బీవీ.రమణయ్య, సురేష్, ప్రసాద్, చంద్రయ్య, ఇంద్రావతి, ప్రభావతి, మునికుమారి, లక్ష్మి, పెంచలమ్మ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి: పట్టణంలోని బంగారుపేట వద్ద ఉన్న ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీలు చేస్తున్న రిలే దీక్ష బుధవారం 37వ రోజు కొనసాగింది. తమ డిమాండ్లను పరిష్కరించే వరకు దీక్ష విరమించే ప్రసక్తే లేదని అంగన్వాడీలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వడ్డిపల్లి చెంగయ్య, స్వరూపారాణి, సుభాషిణి, మంజుల, ఐఎఫ్‌టీయూ నాయకులు మమ్ములాబేగం, లక్ష్మీప్రసన్న, అన్నపూర్ణ తదితరులు ఉన్నారు.

కోట: షోకాజ్ నోటీసులకు బెదిరేదిలేదని, బేషరతుగా జవాబు ఇస్తామని అంగన్వాడీలు స్పష్టం చేశారు. కోటలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట బుధవారం కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్వాడీలు నిరసన తెలిపారు. ప్రభుత్వం ఈ నెల 10వ తేదీన అంగన్వాడీలకు షోకాజ్ నోటీసులను జారీ చేసింది. ఆ షోకాజ్ నోటీసులు తీసుకోకుండానే ఆయా మండలాల అంగన్వాడీలు తమదైన శైలిలో నోటీసులకు జవాబు పత్రాలను రాసి పంపుతున్నట్లు తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని స్పష్టం చేశారు.

నాయుడుపేట టౌన్: అంగన్వాడీల సమ్మె 37వ రోజుకు చేరుకుంది. రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన షోకాజ్ నోటీసులను కొంతమంది అంగన్వాడీలు తిరస్కరించారు. మరి కొంత షోకాజ్ నోటీసులు అందుకొని వివరణ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సీఐటీయూ మండలాధ్యక్షుడు ముకుంద, అంగన్వాడీ ప్రాజెక్టు కార్యదర్శి శ్యామలమ్మ, మారెమ్మ, కళావతి, వాణి, సంది పాల్గొన్నారు.

వైసీపీ కార్యక్రమంలా ఏటి పండగ: బీజేపీ

నాయుడుపేట, జనవరి 17: ప్రభుత్వ నిధుల ఖర్చుతో నిర్వహిస్తున్న ఏటి పండుగను వైసీపీ కార్యక్రమంలా చేపట్టడం సరికాదని బీజేపీ నాయకులు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నాయుడుపేట స్వర్ణముఖినదిలో ప్రతి ఏడాది ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఏటి పండగ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి రాజకీయాలకు అతీతంగా అందరినీ ఆహ్వానిస్తారని తెలిపారు. ప్రాధాన్యం కలిగిన ఏటి పండుగను ప్రతి పక్షాలకు ఆహ్వానించకుండా వైసీపీ నాయకులు అధికార పార్టీ కార్యక్రమం లాగా ప్రారంభించడం బాధాకరమన్నారు.

ముగ్గుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, జనవరి 17: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు రుద్రాక్ష కౌశల్యం, నాయకులు పప్పు చంద్రమౌళిరెడ్డి, అవ్వారు సత్యనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నలుగురికి రిమాండ్

తిరుపతి(లీగల్), జనవరి 17: ఓ వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన నలుగురు నిందితులకు 15 రోజుల పాటు రిమాండ్ విధిస్తూ తిరుపతి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.వాణిశ్రీ ఆదేశించారు. ఈనెల 14న తిరుపతి రుయా ఆస్పత్రి ప్రాంగణం వద్ద తిరుపతి శ్రీనివాసనగర్‌కు చెందిన గిరిపై హత్యాయత్నానికి పాల్పడ్డ వెస్ట్ రైల్వేస్టేషన్ శ్రీనివాసనగర్‌కు చెందిన భానుప్రకాష్, జగదీష్‌కుమార్ ఈడిగపల్లె రితేష్ బాబు, ఈడిగపల్లె అజయ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు. విచారణ జరిపిన కోర్టు ఈ మేరకు తీర్పునిచ్చింది.

పేదలకు దుస్తుల పంపిణీ

గూడూరు, జనవరి 17: స్థానిక బాలాజీనగర్‌లోని ప్రగతి సేవాసంస్థ కార్యాలయంలో బుధవారం రమేష్ దాతృత్వంతో పేదలకు దుస్తులు, ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసరావు, గోపి, ప్రభాకర్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, ప్రభాకర్, దయాకర్, రాము, వెంకటేశ్వర్లు, కుమార్, మల్లికార్జున పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

గూడూరు, జనవరి 17: స్థానిక అల్లూరిఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో బెస్ట్‌ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు బుధవారం ఉత్సాహంగా జరిగాయి. పలు శాఖలకు చెందిన ఉద్యోగులతో పాటు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జట్లు తలపడ్డాయి. గురువారం ఫైనల్స్‌తో పోటీలు ముగియనున్నాయి.

రేపటి నుంచి కులగణన సర్వే

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 17: తిరుపతి జిల్లాలో శుక్రవారం నుంచి 28వ తేదీ వరకు కులగణన సర్వే నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కులగణన సర్వే చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. కులాల వారీగా జనాభా, సామాజిక, విద్య, ఆర్థిక పురోగతి తెలుసుకోవడానికి, సంక్షేమ ఫలాలు అందించడానికి ఇది దోహదపడుతుందని తెలిపారు. కులగణనకు వచ్చే వారికి ప్రజలు సహకరించాలని కోరారు.

రేపటి నుంచి ఇంటర్ ప్రీఫైనల్ పరీక్షలు

తిరుపతి(విద్య), జనవరి17: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని జూనియర్ కళాశాలల్లో ఇంటర్ కోర్సులు చదివే విద్యార్థులకు ఈ నెల 19నుంచి 25వ తేదీ వరకు ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఐఈవో స్వర్ణలత పేర్కొన్నారు. నిర్ణీత తేదీలలో ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఉదయం 10-1 గంట వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2-5గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. విద్యార్థులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

జగన్‌రెడ్డికి దున్నపోతుపై వానపడ్డట్టు ఉంది

పండుగలకు దూరంగా అంగన్వాడీల నిరసన

తిరుపతి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా లక్ష మందికి పైగా అంగన్వాడీ కార్యకర్తల ఆకలిగోడు పట్టించుకోకుండా దున్నపోతుపై వానపడ్డట్టు ముఖ్యమంత్రి జగన్ వ్యవహరిస్తున్నారని సీఐటీయూ నాయకులు మండిపడ్డారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీలు చేస్తున్న పోరాటం బుధవారం 37వ రోజుకు చేరుకుంది. ఆరుసార్లు చర్చలకు పిలిచి న్యాయం చేయకుండా పండుగలకు కూడా వారిని దూరం చేసి ఆయన పైశాచిక ఆనందం పొందుతున్నారని మండిపడ్డారు. సమస్యలు పరిష్కరించకుంటే రాబోయే రోజుల్లో తమ సత్తా ఏంటో చూపిస్తామని తిరుపతిలోని శిబిరంలో అంగన్వాడీ కార్యకర్తలు హెచ్చరించారు. అదేవిధంగా గూడూరు, వెంకటగిరి, నాయుడుపేట, సూళ్లూరుపేట, పుత్తూరు శ్రీకాళహస్తి, చంద్రగిరిలో పండుగలకు దూరంగా దీక్షా శిబిరాల్లోనే అంగన్వాడీ కార్యకర్తలు నిరసన చేపట్టారు. కోటి సంతకాల సేకరణ కొనసాగించారు.

నేటి నుంచి హెల్తీ విలేజ్ జాతీయ సదస్సు

- ముస్తాబైన మహిళా యూనివర్శిటీ
- వివిధ రాష్ట్రాల నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు రాక

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 17: కేంద్ర, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో పద్మావతి విశ్వవిద్యాలయం వేదికగా గురువారం నుంచి మూడు రోజుల పాటు సుస్థిర అభివృద్ధి, లక్ష్యాల స్థానికీకరణపై ఆరోగ్యకరమైన గ్రామం(హెల్తీ విలేజ్) జాతీయ సదస్సు జరగనుంది. కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో వర్సిటీ ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో దీనికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సూర్యకుమారి ఏర్పాట్లను పరిశీలించారు. వైద్యశాఖ, డీఆర్‌డీఏ, మెప్మా, టీటీడీ, మహిళా శిశు సంక్షేమ శాఖల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. మొదటిరోజు కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్ వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షిస్తారు. ముఖ్య అతిథిగా కేంద్ర సహాయ మంత్రి (పంచాయతీరాజ్‌శాఖ మంత్రి) కపిల్ మోరేశ్వర్ పాటిల్ పాల్గొంటారు. రాష్ట్రం నుంచి డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి బుడి ముత్యాలనాయుడు, జిల్లా మంత్రులు హాజరవుతారు. వివిధ రాష్ట్రాల నుంచి 800మంది ప్రతినిధులు హాజరవుతారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సదస్సులో ముఖ్య అతిథి సందేశం తర్వాత వివిధ రాష్ట్రాల మధ్య చర్చలు జరుగుతాయి. శనివారం జిల్లాలోని ఆదర్శగ్రామాల్లో 250 మంది అతిథుల క్షేత్రస్థాయి సందర్శన ఉంటుంది.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు

చిల్లకూరు, జనవరి 17: మండలంలోని ఏరూరు గ్రామంలో రామసీతా ట్రస్టు ఫౌండర్ చేవూరు నాగరాజు సహకారంతో సంక్రాంతి సందర్భంగా నిర్వహిస్తున్న పంచాయతీ స్థాయి క్రికెట్ పోటీలు బుధవారం హోరాహోరీగా జరిగాయి. మొదటి మ్యాచ్ బలిజపాళెం - కావిలిపాళెం జట్ల మధ్య జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన బలిజపాళెం జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 26 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన కావిలిపాళెం జట్టు 4.2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 29 పరుగులు చేసి విజయం సాధించింది. రెండో మ్యాచ్ బలిజపాళెం-2 - ఏరూరుపుట్టయ్య జట్ల మధ్య జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన పుట్టయ్య జట్టు 10 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 70 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన బలిజపాళెం-2 జట్టు 57 పరుగులకు ఆలౌట్ అవడంతో పుట్టయ్య జట్టు విజేతగా నిలిచింది. మూడో మ్యాచ్ అల్లీపురం- ఏరూరుకావిలిపాళెం జట్ల మధ్య జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన ఏరూరుకావిలిపాళెం జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 55 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన అల్లీపురం జట్టు 9.4 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 59 పరుగులు చేసి విజయం సాధించింది.

టీడీపీ నేత మృతి



శంకరయ్య భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న పరసారత్నం

దొరవారిసత్రం, జనవరి 17: దొరవారిసత్రం మండలం వేణుంబాక దళితవాడకు చెందిన టీడీపీ సీనియర్ నేత కొమ్మల శంకరయ్య(48) బుధవారం మృతి చెందారు. కొంత కాలంగా గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆయన ఆరోగ్యం విషమించడంతో మృతి చెందారు. ఆయన భౌతికకాయానికి మాజీ మంత్రి పరసా వెంకటరత్నం, టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులునాయుడు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు జకరయ్య, మాజీ జడ్పీటీసీ శ్రీహరెడ్డి, నాయకులు మల్లెయ్య, సుధాకర్ యాదవ్, షబ్బీర్, ఓడూరు రమణారెడ్డి, సతీష్‌చంద్ర తదితరులు నివాళులర్పించారు. టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు వేనాటి రామచంద్రారెడ్డి, టీడీపీ పార్లమెంటు ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి ఫోన్‌లో శంకరయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కబడ్డీ విజేత కేశవరం జట్టు

కోట, జనవరి 17: కోట మండలంలో జరిగిన ఆడుదాం.. ఆంధ్రా క్రీడల్లో మండలస్థాయిలో విజేతగా నిలిచిన జట్లను బుధవారం ఎంఈవో మస్తానయ్య షీల్డ్‌లు, మెమోంటోలతో అభినందించారు. మండలస్థాయిలో కబడ్డీ పురుషుల విభాగంలో కేశవరం సచివాలయ జట్టు విన్నర్‌గా, గూడలి సచివాలయ జట్టు రన్నర్‌గా నిలిచాయి. మహిళల విభాగం కబడ్డీలో చిట్టేడు సచివాలయ జట్టు విన్నర్‌గా, ఖోఖోలో సిద్ధవరం సచివాలయ జట్టు విన్నర్‌గా నిలిచారు. గెలుపొందిన జట్లు ఈ నెల 22వ తేదీ నుంచి గూడూరులో జరిగే నియోజకవర్గస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటాయని ఎంఈవో తెలిపారు.

వైభవంగా గ్రామోత్సవం

పెళ్లకూరు, జనవరి 17: సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని తాళ్వాయిపాడు గ్రామంలో వీర్లయ్యస్వామి, మహాలక్ష్మమ్మ ఉత్సవాలను నాలుగు రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రతి ఏడాదీ పండరీ, కోలాట భజనలతో నిర్వహించే స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం బుధవారం జరిగింది. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పలు రకాల పూలతో ప్రత్యేకంగా అలకరించి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. గ్రామస్తులు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం దాత సుబ్బయ్య ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచు కుమారి కల్పన అత్తికాయల సుబ్రహ్మణ్యం, బీస్కర్, బాలయ్య రవి తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మమ్మ గ్రామోత్సవం



కోట, జనవరి 17: కోట పట్టణంలో బుధవారం తెల్లవారుజామున గ్రామదేవత మహాలక్ష్మమ్మ గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఏటా కనుమ పండుగను పురస్కరించుకొని స్థానికుల ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవాలు జరగడం పరిపాటి. ఈ నేపథ్యంలో గాదేవారి కుటుంబసభ్యులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో మహాలక్ష్మమ్మకు విశేష అలంకరణ చేసి కోట పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

సూళ్లూరుపేట, జనవరి 17: సూళ్లూరుపేట పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలో ఎస్ఆర్ లాడ్జి వద్ద బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించగా మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కులగణన సర్వేకు సహకరించండి

గూడూరు, జనవరి 17: పట్టణంలో కులగణన సర్వేకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు కోరారు. ఈనెల 19వ తేదీ నుంచి కలగణన సర్వే ప్రారంభమవుతుదని, సచివాలయ సిబ్బంది సర్వేకు వచ్చినపుడు ప్రజలు వివరాలు తెలిపి సహకరించాలన్నారు.